ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

బుధవారం 24 జూలై 2024





అమరావతికి.. అందలం

వెలుగులు.. ఆదాయం



పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన స్కీమ్ కూడా పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎంతో మేలు చేకూర్చ నుంది. దాదాపు గా నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ని ఈ పథకం ద్వారా పొందవచ్చు. ఇందుకోసం ఏర్పాటు చేసే సోలార్ ప్యానెల్స్ యూనిట్‌కి అయ్యే ఖర్చులో రూ.60 వేల వరకు సబ్సిడీ, మిగతా రూ.లక్ష రుణం రూపంలో సమకూరుస్తారు. వినియోగ దారుడు వినియోగించగా మిగిలే విద్యుత్‌ని విద్యుత్ సంస్థలు కొనుగోలు చేస్తాయి.

ఆక్వాకి.. అండ

బాపట్ల జిల్లాలోని ప్రధాన రంగాల్లో ఆక్వా ప్రముఖం గా ఉంది. దాదాపు 22,000 ఎక రాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ రంగం అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంది. ఈ పరిస్థితుల్లో ఈ రంగానికి అండగా కేంద్ర బడ్జెట్‌లో ప్రకటనలు వెలువడ్డాయి. ముఖ్యంగా రొయ్యలు, చేపల మేతపై



పన్నును 5 శాతానికి తగ్గించారు. దీని వల్ల మేత రేటు తగ్గి పెట్టుబడి ఖర్చుల్లో భారీ తేడా వస్తుంది. తద్వారా ఆక్వారంగం పునర్ వైభవం సాధించడా నికి ఇది ఉపయోగపడుతుందనేది రైతుల మాట. రొయ్యల సాగు కేంద్రాల నెట్‌వర్క్‌లు ఏర్పా టుకి ప్రత్యేక ఆర్థిక సాయం అందించడంతో పాటు నాబార్డ్ ద్వారా దీనిని ఏర్పాటు చేస్తామని బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించింది. మొత్తం మీద కేంద్రం ఆక్వా రంగ అభివృద్ధికి ప్రత్యేక విధానాన్ని తీసుకు రావడంపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మోదీ 3.0 బడ్జెట్ అమరావతి బాట పట్టింది. గత ఐదేళ్లు వైసీపీ పాలనలో ఊసే లేకుండా పోయిన నవ్యాంధ్ర రాజధాని అమరా వతి బాధ్యత మాదంటూ కేంద్రం బడ్జెట్‌లో భరోసా ఇచ్చింది. నిర్మలా సీతారామన్ తన బడ్జెట్‌లో అమరావతికి ప్రత్యేకంగా నిధులు కేటాయించడంపై అటు రాష్ట్రప్రజలతో పాటు అమరా వతి వాసులు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. అటు తరతరాల నుంచి ఉన్న భూములను అమరావతి కోసం ఇచ్చి జగన్ నిర్లక్ష్యం తో రోడ్డెక్కిన రాజధాని రైతులకు భరోసా ఇస్తూ కూటమి ప్రభు త్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. ఉమ్మడి గుంటూరు జిల్లావాసుల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ అమరావతికి ప్రాధాన్యం ఇవ్వడంపై అన్ని వర్గాల ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమ వుతున్నాయి. ప్రత్యేకంగా నిధులతో పాటు రాజధాని కార్యకలా పాలకు అండగా ఉంటామన్న కేంద్రం ప్రకటనతో ఇక అమరావతి అభివృద్ధికి ఢోకా ఉండదని తెలు స్తోంది. కాగా అమరావతికి ప్రత్యేక కేటాయింపులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలు, ప్రైవేటు సంస్థలు అమరావతికి క్యూ కట్టనున్నాయి. దీంతో అమరావతి దశ తిరిగిపోయినట్లే.

- కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యం
- పరుగులు పెట్టనున్న నవ నగర నిర్మాణాలు
- నిధుల కేటాయింపుతో రాజధాని దశ తిరిగినట్లే
- రూ.15 వేల కోట్ల కేటాయింపుపై రైతుల్లో హర్షం
- కష్టాలు తీరిపోయాయన్న ఆనందంలో రైతులు

గుంటూరు, బాపట్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకూ అమరావతి అంటే ఆగిపోయిన భవనాలు, అడవి లా మారిన గ్రామాలు, ఆవేదనా భరితమైన రైతులు. కానీ నేడు అది పూర్తిగా మారిపోయింది. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడంతో అమరావతి తలరాత మారిపోయింది. నవ్యాంధ్ర రాజ ధాని అమరావతి ఇక దేదీప్యమానంగా వెలగబోతోందని మంగళవారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ ద్వారా తెలుస్తోంది. గడిచిన పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా కేంద్ర ప్రభుత్వం రాజధాని అమరావతికి కేంద్ర బడ్జెట్లో స్థానం కల్పించింది. రాజధాని నిర్మాణానికి కేంద్రం రూ.15 వేల కోట్లు సహాయాన్ని ప్రకటించింది. అమరావతి నిర్మాణ అవసరాల రీత్యా భవిష్యత్తులో మ రింత సహాయం అందిస్తామని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టంగా పార్లమెంటులో ప్రకటించారు. అమరావతి అభివృద్ధికి సంబంధించి నిధులు సేకరిం చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతిచ్చింది. జాతీయ, అంతర్జాతీయ ఫైనాన్సు సంస్థల ద్వారా రుణా లు సేకరించుకునేందుకు అవకాశం కూడా కల్పించింది. దీంతో అమరావతి నిర్మాణానికి ఇక ఎలాంటి ఢోకా లేదని తేలిపోయింది.

కుట్రలకు ముగింపు

2014 నుంచి 2019 వరకూ రాజధాని అమరావతి నిర్మాణం పరుగులు పెట్టింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ అమరావతిని విధ్వంసం చేసేందుకు ప్రయత్నించింది. మూడు రాజధానులను తెరమీదకు తెచ్చి అమరావతిని విచ్ఛిన్నం చేయడంతో పాటు, రాష్ట్రానికి రాజధాని లేకుం డా చేసింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో అమ రావతికి స్థానం కల్పించడం, బడ్జెట్ నిధులు కేటాయిం చడంతో ఆ కుట్రలకు తెరపడినట్లయింది. ఆంధ్రుల రాజ ధాని అమరావతేనని కేంద్రం విస్పష్టంగా చెప్పినట్లయింది. దీంతో అమరావతిని భవిష్యత్తులో ఎవ రూ కదిలించలేరని సందేశమిచ్చింది. కాగా కేంద్రం కేటా యించిన నిధులతో అమరావతిలోని ప్రభుత్వ భవనాల నిర్మాణాలన్నీ నిధుల కొరత లేకుండా పూర్తైపోనున్నాయి.

మౌలికంగా ఊరట

కేంద్రం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజల్లో భరోసా నింపింది. ఐదేళ్ల వైసీ పీ పాలనలో గ్రామాలతో పాటు పట్టణాల్లోనూ మౌలిక వసతులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. వీటన్నింటికి మర మ్మతులు చేసేలా కేంద్రం బడ్జెట్‌లో వాటికి ప్రాధాన్యం ఇచ్చింది. గడచిన ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా దారు ణంగా ఛిద్రమైన రహదారులు బాగుపడనున్నాయి. కేం ద్రం నుంచి వచ్చే మ్యాచింగ్ గ్రాంట్ల మొత్తం పెరగ నుండటంతో రోడ్లకు మహర్దశ కలగనుంది. యువతకు విద్యారుణాలతో పాటు ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఇది కూడా గుం టూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలోని యువతకు పెద్ద ఎత్తున లబ్ధి చేకూర్చేదే కావడం గమనార్హం. గ్రామీణా భివృద్ధికి పెద్ద మొత్తంలో కేటాయింపులు జరపడం, ఎం ఎస్ఎంఈలకు క్రెడిట్ గ్యారంటీలాంటి వన్నీ ఉమ్మడి గుంటూరు జిల్లా అభివృద్ధికి దోహదం చేసేవిగా ఉన్నా యి. విద్య, నైపుణ్యాభివృద్ధికి కేటాయింపులతో పాటు ఉపాధి కల్పన విషయంలోనూ ప్రత్యేక ప్రణాళికలను కేంద్రం ప్రకటించడం జిల్లాలోని యువతరానికి ఆశలు రేకెత్తించేవిగానే ఉన్నాయి. రూ.3 లక్షల వార్షికాదాయం లోపు ఉన్న వారికి ఎలాంటి ఆదాయపు పన్ను చెల్లిం చాల్సిన అవసరం లేకుండా పన్ను రేట్ల శ్లాబులను సవ రించడంపై ఉద్యోగ, వ్యాపారవర్గాలు హర్షం వ్యక్తం చేస్తు న్నాయి. ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు పెంచినందున గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు పెద్ద ఎత్తున పనులు లభించనున్నాయి. ప్రకృతి వ్యవసాయం కింద భారీగా రైతులకు ప్రో త్సాహకాలు అందనున్నాయి. ప్రభుత్వ, ప్రై వేటు భాగస్వామ్యంతో పట్టణ ప్రాంతాల్లో అద్దె ఇళ్లను నిర్మించి ఇక్కడికి వచ్చే వలస కూలీలకు ఆవాసం కల్పించేందుకు కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తమౌతున్నది.



సొంతింటి కల సాకారం

ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద, మధ్య తరగతి కుటుంబాల సొంత ఇంటి కలని సా కారం చేస్తామని కేంద్రం ప్రకటించింది. సొం తింటి నిర్మాణానికి రూ.1.50 లక్షల నుంచి రూ.2.67 లక్షల వరకు సబ్సిడీగా అందించ నుంది. పీఎంఏవై కింద ఈడబ్ల్యూఎస్, ఎల్ఐ జీ, ఎంఐజీ-1, ఎంఐజీ-2 కేటగిరీల కింద ఇళ్ల నిర్మాణాలకు కేంద్రం ఆర్థికసాయం అందించ నున్నది. అలానే ఎఫోర్డబుల్ హౌసింగ్ ఇన్ పార్టనర్‌షిప్(ఏహెచ్‌పీ), బీఎల్‌సీ కింద నిర్మించే ఇళ్లకు కూడా ఆర్థికసాయం అందు తుంది. ఈ రెండు కేటగిరీల కింద ఇళ్లు నిర్మిం చుకునే వారికి రూ.1.50 లక్షలను సబ్సిడీగా ఇస్తుంది. ఈడబ్ల్యూఎస్ కేటగిరీ కింద సాయం పొందేవారి వార్షికాదాయం రూ.3 లక్షల లోపు, ఎల్ఐజీ గ్రూపు కుటుంబాలకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు, ఎంఐజీ-1 కింద రూ.6 లక్షల నుంచి రూ.12 లక్షల మధ్య, ఎంఐజీ-2 కింద రూ.12 లక్షల నుంచి రూ.18 లక్షల ఆదాయం పొందే వారికి పీఎంఏవై వర్తి స్తుంది. ఈ నేపథ్యంలో ఈడబ్ల్యూఎస్ కేటగిరీ లబ్ధిదారులకు రూ.2.20 లక్షలు, ఎల్ఐజీ కుటుంబాలకు రూ.2.67 లక్షలు, ఎంఐజీ-1 వారికి రూ.2.35 లక్షలు, ఎంఐజీ-2 వారికి రూ.2.30 లక్షల సబ్సిడీ వస్తుంది. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో సొంత ఇళ్లని కొనుగోలు చేసే అవకాశం ఉన్నది. అపార్టుమెంట్లలో ఫ్లాట్లు కొనుగోలు చేసేవారికి కూడా ఈ స్కీమ్ కింద అర్థికసాయం అందు తుంది. ఈ పథకంతో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వేల కుటుంబాలకు లబ్ధి జరుగుతుందని భవన నిర్మాణ సంస్థలు చెబుతున్నాయి.

ఇక.. ప్రకాశం



కేంద్ర ప్రకటించిన బడ్జెట్‌లో ఉమ్మడి ప్రకాశాన్ని వెనుక బడిన జిల్లాలో జాబితాలో చేర్చి ప్రత్యేకంగా ఆదుకుంటామని హామీ ఇచ్చింది. గతంలో ఉమ్మడి ప్రకాశంలో భాగంగా ఉండిన చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలు ప్రస్తుతం బాపట్ల జిల్లాలో ఉన్నాయి. కేంద్రం ప్రకటన వల్ల ఈ నియోజకవర్గాలకు నిధుల కేటాయింపులో సముచిత స్థానం దక్కనుంది. అదే విధంగా జిల్లాలోని వెనకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం కానున్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాని వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చడం వెనక సీఎం చంద్రబాబు కృషి ఎంతో ఉందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు ఇచ్చిన హామీని నెల వ్యవధిలోనే సీఎం హోదాలో కేంద్రం నుంచి రాబట్టడంపై మంత్రి గొట్టిపాటి ఆనందం వ్యక్తం చేశారు.

నిర్మాణాలు ఇక పరుగులు..

2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే అమరావతిలో పను లు ప్రారంభమయ్యాయి. తొలుత కంపచెట్ల తొలగింపుతో మొదలై మెల్లగా నిర్మాణ పనుల వైపుగా ప్రభు త్వం అడుగులు వేస్తోంది. రాజధాని నిర్మాణం కోసం కేంద్రం నుంచి నిధులు తెచ్చుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ప్రత్యేకంగా కేటాయింపులతో పాటు వివిధ ఏజెన్సీల ద్వారా సాయం చేయనున్నట్లు కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించడంతో అమరావతికి నిధుల కొరత కొంత మేర తీరినట్లయింది. ఐదేళ్ల క్రితం ఆగిపోయిన అద్భుత భవనాలు పూర్తయ్యే వీలు కలిగింది. దీంతో 90 శాతం పూర్తయిన ఆలిండియా ఉద్యోగుల భవనాలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ గృహ సముదాయాలు, గ్రూప్-4 ఉద్యోగుల భవన సముదాయాలు పూర్తవడానికి ఇక ఎంతో సమయం పట్టకపోవచ్చు. వాటితోపాటు మంత్రులు, న్యాయమూర్తుల గృహ సముదాయాలు కూడా వేగంగా పూర్తవుతాయి. కాగా ఐకానిక్, సచివాలయ టవర్స్, అసెంబ్లీ భవనాల నిర్మాణం కూడా చకచకా సాగనున్నది.

రైతుల కష్టాలు తీరినట్లే..



గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం రాజధానికి భూములిచ్చిన రైతులను వేధించింది. వారికి ఏటా చెల్లించాల్సిన కౌలు కూడా చెల్లించలేదు. గడిచిన రెండేళ్లుగా రైతులకు ఇవ్వాల్సిన రూ.380 కోట్ల కౌలు చెల్లించక పోవడంతో రైతులు అప్పులపాలై అల్లాడు తున్నారు. పిల్లలచదువులకు ఫీజులు కూడా కట్టుకోలేని దయనీయ స్థితిలో చాలామంది రైతులు ఇబ్బందులు పడు తున్నారు. కేంద్రం నుంచి నిధులు రావ డంతో వారు ఇప్పుడు ఊపిరి పీల్చుకు న్నారు. రాజధా నికి కేంద్ర నిధులు వస్తుం డడంతో తమ కష్టాలు తీరనున్నాయని వారు ఆనం దంలో ఉన్నారు.

కుట్రలకు తెర



అమరావతిపై గత ప్రభుత్వం చేసిన కుట్రలకు తాజా బడ్జెట్‌తో తెరపడింది. అమరావతిని కేం ద్ర ప్రభుత్వం గుర్తించడమే కా కుండా, నిధులు కూడా కేటాయించింది. దీంతో రాష్ట్రానికి రాజధాని అమరావతేనని ఖాయమై పోయింది. ఇక ఏ ప్రభుత్వం వచ్చినా రాజధాని ని మార్చడం అసంభవం. ఇక వారి కుట్రలకు కాలం చెల్లిపోయినట్లే. **- లంకా సుధాకరరావు, రైతు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు**

మా ఆవేదనకు సమాధానం



ఐదేళ్ల మా ఆవేదనకు సమాధానం దొరికింది. కేం ద్రం బడ్జెట్ కేటాయించడం ద్వారా తాము రైతుల పక్షాన ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ఐదేళ్ల మేం పడిన కష్టాలు ఇక తీరిపోతాయని భావిస్తున్నాం. మాకు రా వాల్సిన కౌలు బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాం.

- మాదాల పున్నయ్య, మందడం రైతు

అభివృద్ధికి ఢోకా లేదు



ఇప్పటి వరకూ గుర్తించని అమరావతికి ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించడం ఆనందంగా ఉంది. దీంతో రాజధాని నిర్మాణానికి ఎలాంటి ఢోకా ఉండదు.

- రామినేని చిన్నా, నెక్కల్లు రైతు



అడ్మిషన్లు.. అదుర్స్

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 75 శాతం ఇంజనీరింగ్ సీట్ల భర్తీ
- పక్కరాష్ట్రాల్లో ఇంజనీరింగ్ చేరికలకు ఈ ఏడాది ఫుల్‌స్టాప్



గుంటూరు(విద్య), జూలై 23: ఒకవైపు ఊపందు కోనున్న అమరావతి నిర్మాణాలు.. మరోవైపు విశాఖలో ఐటీ కారిడార్ ఏర్పాటుకు ఏర్పాట్లు.. ఇంకోవైపు భారత్ పెట్రోలియం ఆయిల్ రిఫైనరీ సంస్థ ఏర్పాటుకు సన్నా హాలు.. రాష్ట్రంలో విద్యుత్ వాహనాల కంపెనీలు పెట్టు బడులపై ఆసక్తి.. ఈ నేపథ్యంలో పెరగనున్న ఉద్యోగ అవకాశాలతో పాటు ఈ ఏడాది తొందరగా ప్రారంభ మైన ప్రక్రియ తో ఇంజనీరింగ్ అడ్మిషన్లకు ఊపువచ్చిం ది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో గతానికి భిన్నంగా ఈ ఏడాది తొలి విడత కౌన్సెలింగ్‌లోనే కొన్ని కళాశాలల్లో 75 శాతానికిపైగా సీట్లు, మరికొన్ని కళాశాలల్లో నూరుశాతం సీట్లు భర్తీ అయినట్లు సమాచారం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం తీసుకుంటున్న సానుకూల నిర్ణయాలే ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి సానుకూల పరిస్థితులు నెలకొన్నాయి. ఒకప్పుడు లక్ష ర్యాంకు దాటిన వారే సివిల్, మెకానికల్, కెమికల్ ఇంజనీరింగ్ బ్రాంచిల వైపు చూసే పరిస్థితి ఉండేది. అయితే ఈ ఏడాది 26 వేల నుంచి 75 వేల ర్యాంకులు వచ్చిన వారు కూడా ఆయా బ్రాంచీల్లో చేరడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇక కంప్యూటర్ ఆధారిత కోర్సుల్లో అయితే 2వేల ర్యాంకులు వచ్చిన వారి నుంచే ఏడాది చేరికలు ప్రారం భమయ్యాయి. తాజాగా ఇంజనీరింగ్ మొదటి, ద్వితీయ సంవత్సరాలు చదివే విద్యార్థులు తాము కోర్సులు పూర్తి చేసే సరికి రాష్ట్రంలో ఐటీ, కెమికల్, సివిల్, మెకానికల్ రంగాల్లో ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందనే భావనలో ఉన్నారు. విద్యుత్‌తో నడిచే వాహనాలు ద్విచక్ర, కార్లు తయారీకి రాష్ట్రంలో సానుకూల అవకాశాలు కల్పించేలా ప్రభు త్వం ఉంది. ఈ నేపథ్యంలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రా నిక్స్ రంగాల్లో ఉద్యోగాలు వస్తాయని ఇంజనీరింగ్ కళాశాలల యాజ మాన్యాలు చెబుతున్నాయి. ఇక భారత్ పెట్రోలియం వంటి సంస్థలు రాష్ట్రంలో రిఫైనరీ ఏర్పాటు చేస్తే వేల ఉద్యోగాలు వస్తాయి. ముడి ఆ యిల్ నుంచి పెట్రోల్, డిజిల్, ఇతర ఉప వస్తువుల తయారీలో కెమి కల్ ఇంజనీర్లదే కీలక భూమిక. అంతేకాకుండా రిఫైనరీ ఏర్పాటుతో మె కానికల్, ఐటీ బ్రాంచీల్లో ఉద్యోగాలు వస్తాయని అంచనా వేస్తున్నారు.

సివిల్ ఇంజనీర్లకు భారీ డిమాండ్..

నిర్మాణ రంగంలో కీలకమైన సివిల్ ఇంజనీర్లుకు త్వరలో భారీ డిమాండ్ ఏర్పడనుంది. అమరావతి రాజధానికి నిర్మాణాలు ఇప్పు డిప్పుడే ఊపందుకుంటున్నాయి. రాజధానిలో నిర్మాణాలు ఒక కొలిక్కి వచ్చి వేగం పుంజుకోవడానికి కనీసం ఏడాది సమయం పడుతుంది. గతంలో ప్రతిపాదించిన అనేక ప్రాజెక్టులు పట్టాలెక్కితే రాజధాని ప్రాం తంలో సివిల్ ఇంజనీర్లకు భారీ డిమాండ్ ఏర్పడనున్నది. మరోవైపు రాజధాని నిర్మాణాలతోపాటు ఉమ్మడి గుంటూరు జిల్లాలో రియల్ ఎస్టే ట్ రంగంలో నిర్మాణాలు వేగం పుంజుకోనున్నాయి. ఫలితంగా సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని బిల్డర్లు చెబుతున్నారు. దీంతో ఈ ఏడాది సివిల్ ఇంజనీరింగ్ బ్రాంచీల్లో దాదాపు సీట్లు మొత్తం భర్తీ అయ్యే పరిస్థితి నెలకొంది.

సమీకృత కలెక్టరేట్‌కి స్థలాన్వేషణ

కర్లపాలెం, మూలపాలెం, ప్యాడిసన్‌పేటలో భూముల పరిశీలన

బాపట్ల, జూలై 23: బాపట్ల జిల్లాకు సంబంధించి సమీకృత కలెక్టరేట్ భవనానికి అవసరమైన స్థలాన్ని క లెక్టర్ జె.వెంకటమురళి మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న కలెక్టరేట్ పరిధిలోని భూమికి సంబం ధించిన దస్త్రాలు, మ్యాప్‌లను కలెక్టర్ పరిశీలించారు. తదుపరి కర్లపాలెంలోని సత్యవతిపేటలో ఖాళీగా ఉన్న తాటితోపు భూమిని పరిశీలించారు. అనంతరం మూల పాలెం పంచాయతీపరిధిలోని మెడికల్ కళాశాల భవ నం వద్ద ఉన్న భూమిని, ప్యాడిసన్‌పేటలో ఖాళీగా ఉన్న 54.16 ఎకరాల ప్రభుత్వ భూమి పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, ఆర్డీవో గంధం రవీందర్, సర్వే అధికారులు పాల్గొన్నారు.



సమీకృత కలెక్టరేట్‌కి అవసరమైన స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

ఆక్వా పార్కుకు భూముల పరిశీలన

రేపల్లె, జూలై 23: ఆక్వాపార్కు నిర్మాణానికి స్థలసేక రణ కోసం భూములను పరిశీలించినట్లు జేసీ సుబ్బారావు తెలిపారు. మంగళవారం నిజాంపట్నం, దిండి పరిసర ప్రాంత గ్రామాల్లో ఆయన పర్య టించి భూములను పరిశీలించారు. త్వరితగతిన స్థల సేకరణ కోసం చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారు లకు సూచించారు. ఇప్పటికే ప్రభుత్వం నిధులు కేటాయించిందని, 192 ఎకరాల భూసేకరణ పూర్తి చేస్తే ఆక్వాపార్కు నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. భూ సేకరణ ఎంత తొందరగా జరిగితే పార్కు నిర్మాణ పనులను అంత తొందరగా ప్రారంభించవచ్చన్నారు. రైతులతో మాట్లాడాలని, ఇబ్బం దులు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే స్వయంగా వారితో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హేలా షారోన్, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీలో పెట్టుబడులకు అనుకూలం

● జపాన్ రాయబారి సుజుకి హిరోషితో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు, జూలై 23: ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఎంతో అనుకూలమని, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధచూపుతుందని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు జపాన్ రాయబారి సుజుకి హిరోషికి తెలిపారు. ఢిల్లీలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు జపాన్ రాయబారిని ప్రత్యేకంగా కలిసి కొద్దిసేపు ముచ్చటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సత్సంబంధాలు, ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర బడ్జెట్‌లో నిధులు, రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశాలు, ప్రభుత్వ ప్రాధాన్యాలు, ఉపాధి కల్పనకు సంబంధించిన అంశాలపై చర్చించారు.



సుజుకి హిరోషికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు



సమీక్షలో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ వసంతరాయుడు

పారిశుధ్యం లోపిస్తే ఎంపీడీవోలపై క్రమశిక్షణా చర్యలు

● జడ్పీ సీఈవో వసంతరాయుడు హెచ్చరిక

గుంటూరు సిటీ, జూలై 23: గ్రామాల్లో పారిశుధ్యం లోపించినా, మంచినీటి సరఫరాపై ఫిర్యాదులు వచ్చినా ఎంపీడీఓలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని జిల్లా పరిషత్ సీఈఓ ఎన్‌వీవీఎస్ వసంతరాయుడు హెచ్చరించారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన ఎంపీడీఓలతో సమీక్ష నిర్వహించారు. తొలుత సీఈఓ ఉమ్మడి జిల్లాలో ప్రధానమంత్రి ఆదర్శ గ్రామయోజన మొదటిదశ పనులపై గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో మరో 53 గ్రామాలు ఈ పథకానికి ఎంపికయ్యాయని తెలిపారు. ఈ నెలాఖరులోగా ఆయా గ్రామాల నుంచి విలేజ్ డెవలప్‌మెంట్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఎంపీడీఓలు, గ్రామ పంచాయతీ కార్యదర్శి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతిరోజు కాల్వలు తీయించాలని, ప్రతి 15 రోజులకొకసారి గ్రామాల్లోని వాటర్ ట్యాంక్ శుభ్రపరచాలని సీఈఓ అన్నారు. తాగేనీటిని తప్పనిసరిగా క్లోరినేషన్ చేయించాలని ఎంపీడీఓలను ఆదేశించారు. మండల పరిషత్, జిల్లా పరిషత్‌లో ఉన్న 15వ ఆర్థికసంఘం నిధులను వినియోగించుకోవాలని అన్నారు. సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈఓ జే మోహన్‌రావు, సోషల్ వెల్ఫేర్ డీడీలు మధుసూదన్, దేబోరా తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏపీ వైస్ చైర్మన్‌గా మైనేని



మైనేని సత్యనారాయణ

వేమూరు, జూలై 23: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమల ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా వేమూరు మండలం పెనుమర్రు గ్రామానికి చెందిన మైనేని సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ ప్రదీప్‌మిశ్రా ఆదేశాలపై సెంట్రల్ ఆఫీస్ ఇన్‌చార్జి సునీల్‌వర్మ మంగళవారం సత్యనారాయణకు నియామకపత్రాలను పంపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ విలేకర్లతో మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం ఇస్తూ బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించారన్నారు. తద్వారా మహిళలు, యువత, నిరుద్యోగులకు అనేక రకాలుగా ప్రోత్సాహకాలు అందించి వారి ఆర్థిక స్వావలంబనకు సహకరించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఈ విధానం ద్వారా మోదీ ఆశయ సాధనకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

నాడు-నేడు అవినీతిపై విచారణ చేయాలి

● శాసనసభలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పొన్నూరుటౌన్, జూలై 23: సెంట్రల్ ప్రొక్యూర్మెంట్ పేరుతో జగన్ చేసిన నాడు-నేడు పనుల్లో భారీ అవినీతిపై సమగ్ర విచారణ చేయాలని మంగళవారం శాసనసభలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకంలో ఫేజ్-1, 2 కింద రూ.9వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇంకా రూ.4,700కోట్లు ఖర్చు చేస్తే కానీ పథక నిర్మాణం పూర్తి కాదన్నారు. ఈ పథకం ద్వారా అద్భుతాలు జరిగినట్లుగా వైసీపీ ప్రభుత్వం ప్రచారం చేసుకుందని ఎద్దేవా చేశారు. సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ పేరుతో టెండర్లు పిలిచి స్థానికంగా కావలసిన ఫర్నిచర్ కొనుగోలు చేసి వైసీపీ నాయకులే ఖర్చుబెట్టారని ఆరోపించారు. పొన్నూరు పురపాలక సంఘంలో ఈ పనులను పరిశీలిస్తే పనులు చేయకుండానే నిధులు డ్రా చేసినట్లు తమ పరిశీలనలో తేలిందన్నారు. పురపాలక సంఘం పరిధిలో ఐదు పాఠశాలలు పరిశీలిస్తే ఈ అవినీతి బాగోతం వెలుగు చూసినట్లు చెప్పారు. శ్రీరామ మున్సిపల్ హైస్కూల్‌లో పథకం కింద రూ.26లక్షలు ఖర్చు చేసి పాత నిర్మాణాలకే రంగులు వేయటం, పాత టాయిలెట్లనే కొత్తగా నిర్మించినట్లు చూపారని ఆరోపించారు. కిందిస్థాయిలో పేరెంట్స్ కమిటీ, హెచ్‌ఎంలను ఈ పథకానికి బాధ్యులుగా ఎంచుకున్నారని ఆరోపించారు. వైసీపీ పెద్దలు రాష్ట్రంలో దోచుకుంటే, పట్టణాలు, మండలాల్లో స్థానిక వైసీపీ నాయకులు పాఠశాలలను పంచుకుని ఇష్టారాజ్యంగా పనులు చేయకుండా డబ్బులు డ్రా చేశారని ఆరోపించారు. పాఠశాలల్లో బాగున్న నాపరాయి ఫ్లోరింగ్‌ను తొలగించి గ్రానైట్ రాయిని ఎక్కువ ధరకు కొనుగోలు చేసి ఫ్లోరింగ్‌లు వేశారని ఆరోపించారు. ప్రభుత్వ పనులకు ఉచిత ఇసుక అని చెప్పి కాంట్రాక్టర్లకు బిల్లులు చూపించి మినహాయింపులు ఇచ్చారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలను వేదికగా చేసుకుని వైసీపీ పెద్దలు దోపిడీ చేశారని ఆరోపించారు. ఈ పథకం కింద ప్రారంభించిన భవనాలు అసంపూర్తిగా ఆగిపోయి అగమ్య గోచరంగా మిగిలిపోయాయన్నారు. సమగ్ర విచారణ జరపాలని ఎమ్మెల్యే నరేంద్ర విద్యాశాఖ మంత్రిని కోరారు.

రైతుల నుంచి ఫిర్యాదులొస్తే కమీషన్ ఏజెంట్ లైసెన్స్ రద్దు

● ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉన్నది ● కమీషన్, ఎగుమతి వ్యాపారస్థులతో మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు

గుంటూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు రైతులు తెచ్చిన మిరపకాయలను విక్రయించిన 24 గంటల్లో నగదు చెల్లించాలి. ఈ విషయంలో కమీషన్ వ్యాపారస్థులదే పూర్తి బాధ్యతని మార్కెటింగ్ శాఖ జేడీ, యార్డు పర్సన్ ఇన్‌చార్జ్ కాకుమాను శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ నెల 21వ తేదీన 'మిర్చి మాంద్యం' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. మంగళవారం మిర్చియార్డుకు వచ్చి ఆయన ఎగుమతి, కమీషన్ వ్యాపారస్థుల సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు తమ సరుకు అమ్మిన వెంటనే తక్‌పట్టీ తప్పక తీసుకోవాలన్నారు. రైతులకు నగదు ఇచ్చే సమయంలో తక్‌పట్టీపై రైతు సంతకం విధిగా తీసుకోవాలని కమీషన్ వ్యాపారస్థులను ఆదేశించారు. రైతులకు చెల్లించాల్సిన అమ్మకపు సొమ్మును అదే రోజు చెల్లించాలన్నారు. ఎవరైనా రైతులకు నగదు చెల్లించలేదని ఫిర్యాదులొస్తే విచారణ జరిపి కమీషన్ ఏజెంట్ లైసెన్స్‌ని శాశ్వతంగా రద్దు చేస్తామని హెచ్చరించారు. మార్కెట్ యార్డులో నిత్యం మైకు ద్వారా ప్రకటనలు జారీ చేస్తామన్నారు.



మిర్చి కమీషన్, ఎగుమతి వ్యాపారులతో సమావేశమైన మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు

రైతులకు టోల్‌ఫ్రీ నెంబరుని కూడా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. యార్డు వెలుపల జరిగే లావాదేవీలకు మార్కెట్ కమిటీకి సంబంధం ఉండదని చెప్పారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి, మార్కెటింగ్ ఏడీ రాజబాబు, అసోసియేషన్ల నాయకులు జుగిరాజ్ భండారి, సుధాకర్, అప్పిరెడ్డి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సాఫ్టుబాల్ ఉమ్మడి జిల్లా సీనియర్ జట్ల ఎంపిక



ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైన సీనియర్ సీఫ్టబాల్ క్రీడాకారుల బృందం

క్రోసూరు, జూలై 23: ఉమ్మడి గుంటూరు జిల్లా సీనియర్ సాఫ్టుబాల్ చాంపి యన్ షిప్ కోసం బాలుర, బాలికల జట్లను మంగళవారం క్రోసూరు సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఎంపిక చేశారు. బాలుర జట్టులో 18, బాలికల జట్టులో 18 మందిని ఎంపిక చేసినట్లు జిల్లా సెక్రటరీ శివపార్వతి తెలియజేశారు. బాలికల జట్టులో పీ జ్యోతిర్మయి, జీ నందిని, సీహెచ్ అనిత, షేక్ యాస్మిన్(క్రోసూరు సెయింట్ ఆన్స్), కే రోజా, ఈ లిడియ, కే దీవెన ఏంజల్, ఎస్ దుర్గామాధవి, జీ సునందిని, కే తేజశ్విని, హరిప్రియ, సీహెచ్ పావని, ఈ చంద్రిక, ఏ తిరుమల, పీ వర్షిక, బీ పూజిత, బీ సుప్రియ, చైతన్య ఎంపికైన వారిలో ఉన్నారు. బాలుర జట్టులో సాగర్ బాబు, బాబావలి, రాంబాబు, నాగూర్, ప్రేమ్‌కుమార్, షేక్ హయ్యూం, వీ సుజయ్, యూ నరేంద్ర, కే కుమార్, వీ సాయికుమార్, ఎం నల్కు, కే సాగర్, ఎస్‌వీ నిషిత్ రెడ్డి, కే మంజిత్, పీ అమీర్, ఆర్ జేమ్స్, పీ హరినాగ సాయి, కే ఈశ్వర్ ఉన్నారు. ఎంపిక కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మేరీ రజిత, సాఫ్టు బాల్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ నరసిం హారెడ్డి, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు

పిడుగురాళ్ల, జూలై 23: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ఇరువురిపై పిడుగురాళ్ల పోలీసులు కేసు నమోదుచేశారు. పిడుగురాళ్లకు చెందిన బత్తుల శేఖర్ విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి కిలో గంజాయి రూ.3వేలకు కొనుగోలు చేసి పిడుగురాళ్లకు తీసుకొచ్చిన తరువాత పట్టణానికి చెందిన మురికిపూడి ప్రదీప్‌చంద్ర సహాయంతో చిన్నచిన్న ప్యాకెట్లుగా మార్చి ఒక్కొక్క ప్యాకెట్ రూ.200 చొప్పున విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులకు అందిన సమాచారం మేరకు మురికిపూడి ప్రదీప్‌చంద్ర వద్ద 1080గ్రాముల గంజాయి లభించగా, స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేశారు. మురికిపూడి ప్రదీప్‌చంద్రను అరెస్టుచేసి కోర్టులో హాజరుపర్చారు. బత్తుల శేఖర్ పరారీలో వున్నట్లు పోలీసులు తెలిపారు.

చెప్పులు షాపు నిర్వాహకుడు ఆత్మహత్య

గుంటూరు, జూలై 23: స్థానిక అరండల్‌పేట నాలుగోలైన్‌లో చెప్పులషాపు నిర్వాహకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. ముత్యాలరెడ్డినగర్‌కు చెందిన ఎండ్లూరి శ్రీహరి(55) గీతాకేఫ్ ఎదురుగా చెప్పులషాపు నిర్వహిస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలురావడంతో అప్పులపాలయ్యాడు. తాను ఆత్మహత్య చేసుకుంటానంటూ కొద్దిరోజులుగా స్నేహితుల వద్ద అంటుండేవాడు. కాగా ముత్యాలరెడ్డినగర్లోని ఇంటికి రంగులువేస్తుండటంతో భార్య బంధువుల ఇంటికివెళ్ళింది. దీంతో సోమవారం రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న శ్రీహరి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం ఇంటికి వచ్చిన భార్య గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. అరండల్‌పేట పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు. శ్రీహరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గుంటూరు ఛానల్‌కు నిధులు కేటాయించాలి

● నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు

పెదనందిపాడు, జూలై 23: ప్రభుత్వం గుంటూరు ఛానల్‌కు వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు కోరారు. మండలంలోని నాగులపాడులో సుబ్రహ్మణ్యేశ్వస్వామి దేవస్థానం వద్ద మంగళవారం నల్లమడ రైతు సంఘ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎనిమిది దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు తాగు, సాగునీటి సమస్యపై పోరాటం చేస్తున్నప్పటికీ సమస్యను పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. గతంలో 5వేల క్యూసెక్కుల నీటి పారుదల సామర్థ్యంతో నల్లమడ ఆధునీకరణ చేపట్టేందుకు నిధులు కేటాయించారని, గత ప్రభుత్వం వాటిని రీటెండర్ల పేరుతో నిలుపుదల చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నల్లమడ వాగు ఆధునీకరణకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి ముంపు నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. గుంటూరు ఛానల్ పొడిగింపు కోసం గతంలో 21 రోజుల పాటు శాంతియుత నిరసనలు తెలియజేసిన రైతులు, మహిళలపై పోలీసు అధికారులు విచక్షణారహితంగా ప్రవర్తించి, అక్రమ కేసులు బనాయించారని, వీటిని ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘ నాయకులు యార్లగడ్డ అంకమ్మచౌదరి, బండి నాగేశ్వరరావు, కాపు వెంకటసుబ్బారావు, లావు అంకమ్మచౌదరి, అడ్డగడ వెంకటేశ్వర్లు, మొవ్వా పెద్దన్న, బండి కామేశ్వరావు, కొల్లా రామన్, ఈదర భ్రమరాంబ, కొల్లా నిర్మల, లావు చౌడేశ్వరి, దొప్పలపూడి మంజూష, పాటింబండ్ల శ్రీనివాసరావు, కారుమంచి విజయ్‌కుమార్, బండి వెంకటశివరావు, ముత్తవరపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు

స్పీకర్ ఎంపిక బీసీ వర్గాలకు సముచిత న్యాయం

● రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన

తెనాలి అర్బన్, జూలై 23: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పీకర్ పదవికి అయ్యన్నపాత్రుడిని ఎంపికచేసి బీసీ వర్గాలకు సముచిత న్యాయం చేశారని రాష్ట్ర బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు చెప్పారు. మంగళవారం అమరావతిలో స్పీకర్‌ను కలిసి సత్కరించామన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో శాసనసభ సమావేశాలు అనైతిక దూషణలతో జరిగాయని, వీటిపట్ల ప్రజలు ఎంతో మనస్తాపం చెందారని చెప్పారు. పవిత్ర దేవాలయంతో సమానమైన శాసనసభలో ప్రజలకు అవసరమైన అంశాలపై స్నేహపూర్వక వాతావరణంలో చర్చ జరగాల్సివుండగా అలాంటి వాతావరణమే గత ప్రభుత్వం కల్పించలేకపోయిందన్నారు. ఈ దుష్ట సంప్రదాయాన్ని ప్రజలు గమనించి తగినవిధంగా వారికి బుద్ధి చెప్పారని, తప్పు తెలుసుకోకపోగా అదే రీతిని వైసీపీ ఎమ్మెల్యేలు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. సభను హుందాగా నడిపి ప్రజల కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం అవసరమైన నిర్ణయాలు తీసుకునేందుకు స్పీకర్ కృషి చేయాలని కోరామన్నారు. బీసీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



స్పీకర్ అయ్యన్నపాత్రుడిని సత్కరిస్తున్న బీసీ సంఘాల నేతలు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

విద్యుదాఘాతంతో రైతు మృతి



శ్రీహరి (ఫైల్‌ఫొటో)

మాచర్ల రూరల్, జూలై 23: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని పశువేములలో జరిగింది. గ్రామానికి చెందిన దోసపాటి శ్రీహరి (65) మంగళవారం తన పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా 11కేవీ విద్యుత్ వైరు తెగిపడింది. ఆ సంఘటనలో శ్రీహరి కాళ్లు, చేతులు, ఉదర భాగానికి తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలో ఉన్న మరో రైతు దోసపాటి కనకయ్య విద్యుత్ లైన్‌మ్యాన్ హుస్సేన్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దగ్గరకు వెళ్లి పరిశీలించగా అప్పటికే శ్రీహరి మృతిచెందాడు. విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభిరామయ్య సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. మృతుడు శ్రీహరి భార్య కాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. శ్రీహరి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

56,693 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 54,687 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 56,693 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 14,534 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8500	17500	334	9000	15500
నెంబరు. 5	9000	11000	నెంబరు. 5	10000	10500
273	11000	13000	273	12500	12500
341	8500	16000	341	8500	15000
4884	--	--	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18000	తేజ	9300	18200
బ్యాడిగి	8500	17000	బ్యాడిగి	9000	12700
దేవనూరుడీలక్స్	10000	15000	దేవనూరుడీలక్స్	8000	10000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	11200

అమరావతికి రూ.15వేల కోట్ల కేటాయింపు హర్షణీయం

● ప్రధానికి రెవెన్యూ మంత్రి అనగాని కృతజ్ఞతలు

రేపల్లె, జూలై 23: ప్రజానీకం ఎన్నికల్లో ఇచ్చిన మహోన్నతమైన తీర్పును గౌరవించి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రానికి నిధులు కేటాయించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌కు రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు. కేంద్రప్రభుత్వం తమ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించి నిధులు కేటాయించటం హర్షదాయకమన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లు కేటాయించటం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రకటించటం రాష్ట్ర ప్రజల తరుపున ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. విశాఖపట్నం, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణానికి సహాయం, గ్రామీణాభివృద్ధి పథకాలకు రూ.2.66లక్షల కోట్లు ప్రకటన, ఆక్వాసాగుకు ప్రోత్సహం పూర్వోదయ పథకం ద్వారా రాష్ట్రానికి ప్రత్యేక ప్రాజెక్టుల మంజూరు రాష్ట్రాభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. నీరు, విద్యుత్, రైల్వే, రోడ్ల ప్రాజెక్టులకు దశల వారీగా నిధులు, రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఉపకరిస్తాయన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఎనలేని కృషిచేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని, తమకేమీ అధికార పదవులు వద్దని కేంద్రంతో చెప్పి ప్రధానమంత్రి నరేంద్రమోదీని రాష్ట్రంవైపు చూసేలా చెయ్యటంతో రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం బడ్జెట్ ద్వారా ఈ స్థాయిలో నిధులు మంజూరు చెయ్యటం సాధ్యమైందన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి నిధుల కేటాయింపుపై హర్షం

● ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జూలై 23: రాజధాని అమరావతి అభివృద్ధికి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.15వేల కోట్లు బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించడంపై గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణం కోసం రూ.15వేల కోట్ల కేటాయింపుతో పాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, రాయలసీమ, ప్రకాశం జిల్లా ప్రాంతంలో వెనుకబడిన జిల్లాలకు తగిన సాయం ప్రకటించడం సంతోషదాయకమన్నారు. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధికి కేంద్రం నుండి సహకారం వుంటుందని, విశాఖ-చెన్నై కారిడార్, హైదరాబాద్ - బెంగుళూరు కారిడార్‌ల అభివృద్ధితో పాటు విద్యుత్, రైల్వే, రహదారుల అభివృద్ధికి దశల వారీగా నిధుల కేటాయింపుతో రాష్ట్రం అభివృద్ధి దిశగా మరింత ముందుకు వెళ్తుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితోనే ఏపీకి కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరిగాయని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు.

రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్

● వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, జూలై 23: రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగిందని వేమూరు ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధితో పాటు అన్ని వర్గాల ప్రజలకు ఎంతగానో ఉపకరించేలా రూపకల్పన జరిగిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు సమర్థతతోనే కేంద్రం నిధులు ప్రకటించడం జరిగిందన్నారు. కూటమి పాలనకు అపూర్వ విజయాన్ని ప్రజలు అందించారని, అందుకు ఫలితంగా కేంద్ర ప్రభుత్వం కూడా స్పందించడం జరిగిందన్నారు. దానిని రాష్ట్ర ప్రయోజనాల కోసంగా వాడుతున్న చంద్రబాబు కృషి ఎంతో శ్లాఘనీయమన్నారు. జగన్ ప్రభుత్వం ఐదు సంవత్సరాల పాలనలో రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేసిందని, తిరిగి రాష్ట్రాన్ని పురోభివృద్ధిలోకి తీసుకువెళ్ళేందుకు ఎంతో కష్టపడాల్సి వస్తుందన్నారు. ఈ విషయాలన్నింటిపై సుదీర్ఘ అనుభవం కలిగిన చంద్రబాబు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నారన్నారు. అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర పరిస్థితిని వివరించి బడ్జెట్‌లో ప్రాధాన్యాన్ని కల్పించడానికి ప్రధాన భూమిక పోషించారన్నారు. తద్వారా రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధితో పాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, రైతులు, కార్మికులు, నిరుద్యోగ యువత, మహిళలు తదితర అన్ని రంగాలకు బహుళ ప్రయోజనం కల్పించే కేంద్ర బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ ఆమోదించక తప్పదు అన్నారు.

చంద్రబాబు, జగన్‌కు తేడాను చాటిచెప్పిన కేంద్ర బడ్జెట్

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూలై 23: సమర్థుడి చేతిలో రాష్ట్రం ఉంటే ఎలా ఉంటుందో కేంద్ర ప్రవేశపెట్టిన బడ్జెట్ ఒక ఉదాహరణ అని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, మాజీ సీఎం జగన్‌రెడ్డికి మధ్య తేడా ఏంటో కేంద్ర బడ్జెట్ కేటాయింపులు స్పష్టంగా చాటి చెప్పాయని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ ఎన్డీఏ కూటమిలో చేరికపై అవాకులు, చవాకులు పేలినవారికి ఈ బడ్జెట్ చెంపపెట్టులాంటిదని జీవీ తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర రాజధానికి రూ.15వేల కోట్ల ఆర్థికసాయం ప్రకటించడం, రానున్న రోజుల్లో అదనపు నిధులు ఇస్తామని హామీపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు. పోలవరం పూర్తికి అన్నివిధాలుగా సహకరిస్తామనడం ఎంతో విశ్వాసం ఇచ్చిందన్నారు. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజి కింద నిధులు కేటాయించడం, ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక కేంద్రాలకు ఆర్థికసాయం ఎంతో ఉపయోగపడనున్నాయని తెలిపారు. మనకు న్యాయంగా రావల్సిన నిధులు రాబట్టుకోలేని అసమర్థ ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయారని ఎద్దేవా చేశారు. ఊసరవెల్లులు సైతం సిగ్గుపడే స్థాయిలో రోజుకో రంగు మార్చుతూ, పూటకో వేషం వేస్తోన్న జగన్‌రెడ్డి నిజస్వరూపాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని అన్నారు. ఐదేళ్ల ముఖ్యమంత్రిగా ఏరోజైనా కేసులు, కాంట్రాక్టర్లు తప్ప రాష్ట్రం, రాష్ట్రప్రయోజనాల గురించి ఆలోచించారా అంటూ వైసీపీ అధినేత జగన్‌రెడ్డిని ప్రశ్నించారు.

చంద్రబాబు కృషి వల్లే రాష్ట్రానికి ప్రత్యేక నిధులు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూలై 23: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి, సంప్రదింపుల ఫలితంగానే రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక నిధుల కేటాయింపులు జరిగాయని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రత్యేకంగా నిధులు కేటాయించినందుకు కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌లకు ప్రత్తిపాటి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి చూపిన అసమర్థతకు ప్రస్తుత సీఎం చంద్రబాబు అనుభవం, ముందుచూపునకు ఇదే నిదర్శనం అన్నారు. కేంద్రంలో పదవుల కన్నా, రాష్ట్రాభివృద్ధే ముఖ్యమన్న సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మాటలకు అర్థం కూడా ఇప్పుడే అందరికీ అవగతమవుతోందని ప్రత్తిపాటి అన్నారు. కేంద్ర బడ్జెట్ నుంచి అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు నిధులతో పాటు వెనుకబడిన ప్రాంతాలకు ప్యాకేజీ, పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పాటు సాధించటం అభివృద్ధిపై తమకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో చంద్రబాబు ప్రయత్నాలకు ఇది ట్రైలర్ మాత్రమేనని, రానున్న ఐదు సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్ అన్నింటా అగ్రస్థానంలో నిలపటమే ఆయన లక్ష్యం అన్నారు. ముఖ్యమంత్రిగా ఢిల్లీ వెళ్ళినప్పుడు రాష్ట్రానికి ఏం తేవాలి?, ఇందుకోసం ఎలా ప్రయత్నించాలి?, నిధులు, పథకాలు ఎలా సాధించుకోవాలి? అనే అంశాలను చంద్రబాబును చూసి జగన్ నేర్చుకోవాలని హితవు పలికారు. ఐదు సంవత్సరాల తరువాత కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీపై ప్రత్యేక దృష్టి

● పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, జూలై 23: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి ప్రకటించిన వరాలు ఐదేళ్ల సమస్యలకు జవాబు ఇచ్చేలా విశ్వాసం కలిగించిందని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. గుంటూరులోని పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలతో కలసి మాట్లాడుతూ ఎన్నికల్లో ఏపీకి న్యాయం చేస్తానని ప్రధాని మోదీ చెప్పారని, చెప్పినవిధంగానే అమరావతికి రూ.15వేల కోట్లు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించటం అభినందనీయమన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తికి సహకారం, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధుల ప్రకటన ప్రజల్లో విశ్వాసం కలిగించాయన్నారు. ఏపీకి కేంద్రం సరైన గుర్తింపు, గౌరవం కల్పించిందని ఇది శుభ పరిణామమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజనరీ వల్ల సాధ్యపడిందన్నారు. ఏపీకి నిధులు కేటాయించటంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పెదకూరపాడు మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ ముంతాజ్, నియోజక వర్గ నాయకులు మద్దినేని నరసింహారావు, షేక్ దిలీప్, షేక్ మస్తాన్ షరీఫ్ తదితరులు ఉన్నారు.

ప్రకాశం బ్యారేజి గేట్లు మూసివేత

● డెల్టా కాలువలకు 7,700 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, జూలై 23: వాగుల నుండి వచ్చే వరద ఉధృతి తగ్గడంతో మంగళవారం ప్రకాశం బ్యారేజి గేట్లను మూసివేసినట్లు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. ఎగువన ఉన్న మున్నేరు, వెలగలేరు, కట్టలేరు, కీసర తదితర వాగుల నుండి 7వేల 700 క్యూసెక్కుల వరదనీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు వచ్చి చేరుతోందని తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగుల నీటి మట్టం నమోదు అవుతుండగా తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 7వేల 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ తెలిపారు.

రాజధాని నిర్మాణానికి 15వేల కోట్లు ప్రకటించటం హర్షణీయం

● మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్



అన్నం సతీష్ ప్రభాకర్

బాపట్ల, జూలై 23 : రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాజధాని నిర్మాణానికి 15 వేల కోట్ల రూపాయలు ప్రకటించటం హర్షణీయమని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్ పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం నిధులు కేటాయించటంపై అన్నం సతీష్ మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాలలో బడ్జెట్ కేటాయింపులు చేయటం సంతోషదాయకమన్నారు. గత 5 సంవత్సరాల వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి వెనుకబడి ఉందన్నారు. దీనిని మరింత అభివృద్ధి చేసేందుకు బీజేపీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తామని చెప్పటం ఆనందదాయకమన్నారు. సాధ్యమైనంత వరకు పోలవరం ప్రాజెక్ట్‌ను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అదేవిధంగా రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించటం జరిగిందన్నారు. విశాఖ-చెన్నై, ఓర్వకల్లు-బెంగుళూరు పారిశ్రామిక కారిడార్‌కు నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించటం శుభపరిణామమన్నారు.

వికసిత ఆంధ్ర దిశగా బడ్జెట్ కేటాయింపు : యార్లగడ్డ

బాపట్ల,జూలై 23 : వికసిత ఆంధ్ర దిశగా కేంద్ర బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ అన్నారు. కేంద్ర బడ్జెట్ కేటాయింపుపై మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి పెద్ద ఎత్తున కేటాయింపులు చేసినందుకు ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర బడ్జెట్ ఉత్పాదకత, ఉపాధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలికసదుపాయాలు, నూతన ఆవిష్కరణలు, సంస్కరణలు అనే 9 అంశాలకు ప్రాధాన్యత ఇవ్వటం జరిగిందన్నారు. యువత, మహిళ, గ్రామీణ, వ్యవసాయ రంగాలకు, మధ్యతరగతి ప్రజలకు ఊతమిచ్చేవిధంగా కేంద్రబడ్జెట్ ఉందని ఆయన పేర్కొన్నారు.

బడ్జెట్ కేటాయింపుపై సర్వత్రా హర్షం

బాపట్ల, జూలై 23 : కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పెద్ద ఎత్తున బడ్జెట్ కేటాయించటంపై సర్వత్రా హర్షం వ్యక్తమౌతున్నది. బడ్జెట్ కేటాయింపుపై మాజీ ఎంపీపీ దాసరి యోహాను, టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీజీవన్, ఊరూరా జనవిజ్ఞాన రాష్ట్రాధ్యక్షుడు కోట వెంకటేశ్వర్లురెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అన్ని రంగాల అభివృద్ధికి కేంద్రం నుంచి భారీగా నిధులు రాబట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలు, చిన్నారుల భద్రతకు అధిక ప్రాధాన్యం : ఎస్పీ



ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, జూలై 23 : జిల్లాలో మహిళలు, చిన్నారుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఈ విషయమై మంగళవారం ఆయన మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తుపదార్థాలను కట్టడి చేయటానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరైనా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని అన్ని ముఖ్యమైన ప్రాంతాలలో, నిర్మానుష్య ప్రదేశాలలో పోలీసు సిబ్బంది ఏకకాలంలో గస్తీ నిర్వహించి అనుమానిత ప్రాంతాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. ప్రధాన కూడళ్ళల్లో, పాఠశాలలు, కళాశాలల వద్ద ముఖ్యమైన ప్రదేశాలలో పెట్రోలింగ్ నిర్వహించారని తెలిపారు. జిల్లాలో ఎవరైన, ఎక్కడైన చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి రవాణా చేసినా, కలిగి ఉన్నా, విక్రయించినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. మత్తుపదార్థాలకు బానిసలైన వారు వాటి నుంచి బయటపడాలనే ఉద్దేశ్యం ఉంటే పోలీసుశాఖను సంప్రదించాలని, అట్టి వారిని రీహాబిటేషన్ సెంటర్‌లకు పంపించి కౌన్సెలింగ్ ఇప్పిస్తామన్నారు.

అన్నిదానాల కన్నా విద్యాదానం గొప్పది : ఎంఈవో

బాపట్ల, జూలై 23 : అన్నిదానాల కన్నా విద్యాదానం గొప్పదని మండలవిద్యాశాఖాధికారి ఎస్.నిరంజన్ అన్నారు. మండలంలోని చెరువుజమ్ములపాలెం ఎస్‌చర్చి మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎన్‌జీవోస్ అసోసియేషన్ కోశాధికారి పానకాల రాయుడు సౌజన్యంతో మంగళవారం నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.ప్రకాష్‌వర్థిని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంఈవో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. దాత పానకాల రాయుడు మాట్లాడుతూ ప్రతిసంవత్సరం ప్రభుత్వ పాఠశాలలకు తాను పుస్తకాలు అందిస్తున్నానని, ఈ కార్యక్రమాన్ని ఇదేవిధంగా కొనసాగిస్తానని చెప్పారు. కార్యక్రమంలో బాపట్ల రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బీఎస్ నారాయణభట్టు, ఉపాధ్యాయురాలు జోగి శ్యామసుందరి, జేసీఎన్ఎంఎం సొసైటీ అధ్యక్షుడు కన్నెగంటి జాన్‌వెస్లీ, అంగన్‌వాడీ కార్యకర్తలు మెర్సీ సోనీ, సిబ్బంది కీర్తన, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పలకలు, పెన్నులు పంపిణీ చేస్తున్న ఎంఈవో ఎస్.నిరంజన్, దాత పానకాలరాయుడు తదితరులు

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈవో

పిట్టలవానిపాలెం, జూలై 23 : మండలంలోని ఖాజీపాలెం గ్రామపంచాయతీలోని కప్పలవారిపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను మంగళవారం మండల విద్యాశాఖాధికారి-2 కె.రాజారత్నం సందర్శించి రికార్డులను పరిశీలించారు. విద్యాసంవత్సరానికి అందించిన పాఠ్యపుస్తకాలు, మౌలికసదుపాయాలు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వాణి, ఉపాధ్యాయులు కె.నాగసుబ్బయ్య, ఎంఎం నిర్వాహకులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ మరమ్మతులు వేగవంతం చేయాలి : కమిషనర్



మరమ్మతులను పరిశీలిస్తున్న కమిషనర్ నిర్మల్‌కుమార్

బాపట్ల, జూలై 23 : అన్న క్యాంటీన్ భవనం మరమ్మతులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు. సూర్యలంకరోడ్డులోని అన్న క్యాంటీన్ భవనాన్ని మంగళవారం ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మరమ్మతులను పరిశీలించి ఇంకా చేయాల్సిన పనులు గురించి వివరించారు. ఆగస్టు 15వ తేదీన ప్రారంభమయ్యే క్యాంటీన్‌ను ముందుగానే సిద్ధం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలవాలంటే 4 గంటలు తర్వాతే

పట్టణ ప్రజలు వారి సమస్యలను మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయాలంటే సాయంత్రం 4 గంటలు నుంచి 6 గంటల లోపు సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు. ప్రకటించిన సమయంలో కమిషనర్ ఛాంబర్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయన చెప్పారు.

కార్మికుల కుటుంబానికి ఉద్యోగం, ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

బాపట్ల, జూలై 23 : బాపట్ల పురపాలక సంఘంలో పని చేస్తూ మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగం, రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, మట్టిఖర్చులకు డబ్బులు అందజేయాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్‌యూనియన్ రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ కోటిదాసు కోరారు. ఏఐటీయూసీ జిల్లా నాయకుడు తన్నీరు సింగరకొండతో కలిసి వెళ్ళి మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారి, మున్సిపల్ స్పెషలాఫీసర్ సీహెచ్ సత్తిబాబుకు వినతిపత్రం అందజేశారు. చుక్కాకుల నాగరాజు భార్య ఈశ్వరమ్మకు, గందళ్ళ చిన్న అంజమ్మ కుమారుడు తిరుపతి వెంకయ్యకు, పిన్నిబోయన నాగరాజు భార్య పిన్నిబోయన మల్లేశ్వరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.సుబ్బారావు, డి.మాల్యాద్రి పాల్గొన్నారు.

ఏబీఎం స్కూల్ అమ్మిన, కొన్నవారిపై కేసు నమోదుకు ఆదేశాలు

బాపట్ల, జూలై 23 : పట్టణంలోని ఏబీఎం స్కూల్ అమ్మిన, కొన్నవారిపై కేసు నమోదు చేయాలని కోర్టు నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. మోదుగుల బసవపున్నారెడ్డి, తీయగూర నాగిరెడ్డి, కె.ప్రసాదరావు, జీడి దివాకర్‌లపై కేసు నమోదు చేయాలని పట్టణ పోలీసులను ఆదేశించినట్లు సమాచారం. కాగా ఈ విషయమై పట్టణ సీఐ యు.శ్రీనివాసులను వివరణ కోరగా కోర్టు నుంచి ఉత్తర్వులు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

ప్రజలకు ఉచిత ఇసుక అందుబాటులోకి తేవటమే లక్ష్యం

● ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు పరిశీలించాలని సూచన

● జాయింట్ కలెక్టర్ సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సుబ్బారావు

రేపల్లె, జూలై 23 : ప్రజలకు ఉచిత ఇసుక తక్కువ ధరకే అందించే విధంగా ప్రభుత్వం ఎంచుకున్న లక్ష్యాన్ని చేరువ చేసే విధంగా కృషి చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ సుబ్బారావు తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక పథకాన్ని ప్రజలకు చేరువయ్యేలా కృషి చేస్తామన్నారు. తీరప్రాంతంలోని రేపల్లె నియోజకవర్గంలో ఇసుకరీచ్‌లు ఎక్కడపెడితే తక్కువ ఖర్చుతో ప్రజలకు అందుబాటులోకి వస్తుందనే అంశాన్ని మైనింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. వారు పరిశీలించి ఇచ్చిన నివేదికను కలెక్టర్‌కు తెలిపి తద్వారా రీచ్‌ల ప్రారంభం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో హేలాషారోన్, అడిషనల్ ఎస్పీ విఠలేశ్వరరావు, తహసీల్దార్ రవీంద్రబాబు, సీఐలు నజీర్‌బేగ్, మైనింగ్ శాఖాధికారులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ గోడౌన్ పరిశీలన

గరువురోడ్డులోని ఎంఎల్ఎస్ గోడౌన్‌ను జాయింట్ కలెక్టర్ సుబ్బారావు తనిఖీ చేశారు. ప్రజలకు చెందాల్సిన ఆహార పదార్థాలను సరిగ్గా అమలు చేస్తున్నారా లేదా అనే అంశంపై అధికారులను అడిగి వివరాలు సేకరించారు. నాణ్యమైన వస్తువులు,వాల్యూడిటి అయిపోయిన సరుకులు ఏమైనా ఉన్నాయా అనే అంశంపై స్టాక్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హేలాషారోన్, సివిల్ సప్లయిస్ అధికారులు పాల్గొన్నారు.

ఆంగ్లేయులకు సింహస్వప్నం ఆజాద్ : ఎంఈవో

బాపట్ల, జూలై 23 : బ్రిటీష్ వారి గుండెలలో నిద్రించి వారికి సింహస్వప్నంగా మారిన చంద్రశేఖర్ ఆజాద్ భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న తొలి ఆయుధ పోరాటయోధుడని మండల విద్యాశాఖాధికారి దేవరకొండ ప్రసాదరావు తెలిపారు. ఆజాద్ 118వ జయంతిని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని ఆజాద్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో ఎంఈవో మాట్లాడుతూ లాలాలజపతిరాయ్ మృతికి కారణమైన ఆంగ్లేయ అధికారులపై ఆజాద్ ప్రతీకారం తీర్చుకున్నారన్నారు. కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, న్యాయవాదులు జమ్మద్‌బాషా, టి.భాస్కరరావు, కోర్నేలు పాల్గొన్నారు.

పీబీఎన్ కళాశాలలో నూతన కోర్సులు

పొన్నూరుటౌన్, జూలై23 : పీబీఎన్ కళాశాల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ బీకాంలో బ్యాంకింగ్, ఫైనాన్సియల్ సర్వీసెస్, ఇన్స్యూరెన్స్ అనే కొత్త కోర్సును ప్రవేశపెట్టినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.శివ కుమారి మంగళవారం తెలిపారు. భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ కోర్సును రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టినట్లు చెప్పారు. మూడు సంవత్సరాల కాలపరిమితి గల ఈ డిగ్రీ కోర్సు పూర్తయిన తర్వాత విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగ్గా లభించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రెసిడెంట్ కెప్టెన్ ఎన్.అంకప్పచౌదరి, కరస్పాండెంట్ ఎస్.అన్నారావు కోరారు.

ఇన్‌చార్జి టీపీవోగా వెంకటేశ్వర్లు

బాపట్ల,జూలై 23 : మున్సిపల్ ఇన్‌చార్జి టీపీవోగా వెంకటేశ్వర్లును నియమించారు. ఇక్కడ పని చేస్తున్న టీపీవో శ్రీలక్ష్మి దీర్ఘకాలిక సెలవుపై వెళ్ళటంతో ఆమె స్థానంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీలో ఏపీవోగా పని చేస్తున్న వెంకటేశ్వర్లును ఇక్కడ నియమించారు.

విత్తన శుద్ధి కార్యక్రమం

పిట్టలవానిపాలెం, జూలై 23 : పిట్టలవానిపాలెం గ్రామానికి చెందిన బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు చెందిన 15 ఎకరాల సొంత పొలంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి ప్రకృతి వ్యవసాయశాఖాధికారులు ఎన్ఎఫ్ఎ లక్ష్మీ ప్రసన్న, యూనిట్ ఇన్‌చార్జి వరదానమ్మ, అసిస్టెంట్ సౌజన్య, బాపట్ల డివిజన్ అధికారి గంజి శ్రీకాంత్ పాల్గొని రైతులతో కలిసి నారుమడులు వేసుకునేందుకు విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు, రైతు సేవకేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

కట్టలను తవ్విన ప్రాంతాన్ని పరిశీలించిన ఇరిగేషన్ ఏఈ, డీఈలు

కర్లపాలెం, జూలై 23 : కాల్వ కట్టలను అక్రమంగా తవ్వి సొమ్ము చేసుకున్న వ్యక్తిపై చర్యలు చేపట్టాల్సిన నీటిపారుదలశాఖాధికారులు మంగళవారం వైసీపీ నాయకులతో కలిసి వెళ్ళి కట్టలను తవ్విన వ్యక్తితో మాట్లాడి కట్టను మరలా సరి చేయాలని చెప్పి వచ్చారు. అధికారులు కట్టలు తవ్విన వ్యక్తిని అదుపులోకి తీసుకొని చర్యలు చేపడుతారని ఆశించిన రైతులకు అధికారులు వైసీపీ నాయకులతో కలిసి రావటంతో విస్మయం చెందారు. ఈ విషయంపై ఏఈ శ్రీనివాసరావును వివరణ కోరగా నక్కలవారిపాలేనికి చెందిన దబ్బకూటి సాంబయ్య 100 మీటర్ల మేర కాల్వకట్టలను తవ్వేశారని, కట్టను ఒక రోజు వ్యవధిలో సరిచేయాలని సూచించామన్నారు. వచ్చిన వారు వైసీపీ నాయకులని తెలియదన్నారు. రెండురోజులలో కట్టలు సరిచేయకపోతే పోలీసు కేసు నమోదు చేయిస్తామని డీఈ రామమూర్తి వివరించారు.



తుమ్మలశాఖ కాల్వకట్ట తవ్విన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఏఈ శ్రీనివాసరావు

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు లిటిల్ ఏంజెల్స్ విద్యార్థులు



రాష్ట్రస్థాయి చెస్‌పోటీలకు ఎంపికైన విద్యార్థులు చెరుకుపల్లి వేదశ్రీనిధి, షేక్ రిజ్వాన్ అహ్మద్

బాపట్ల, జూలై 23 : బాపట్ల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయలక్ష్మీపురంలో నిర్వహించిన అండర్-7, అండర్-11 బాలబాలికల జిల్లా స్థాయి చెస్ పోటీలలో లిటిల్ ఏంజెల్స్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. బాలికల విభాగంలో 6వ తరగతి విద్యార్థిని చెరుకుపల్లి వేదశ్రీనిధి ప్రథమస్థానంలో, బాలుర విభాగంలో 5వ తరగతి విద్యార్థి షేక్ రిజ్వాన అహ్మద్ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈవిధంగా ఉత్తమ ప్రతిభను కనబరిచిన వీరు అండర్-11 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 27, 28 తేదీలలో భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని స్కూల్ యాజమాన్యం తెలిపారు.

ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలలో ఉద్యోగులు పాల్గొనవచ్చు

● బీజేపీ పట్టణ అధ్యక్షుడు మామిడి రమేష్‌కుమార్

బాపట్లజూలై 23 : ప్రభుత్వ ఉద్యోగులు ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలలో పాల్గొనకుండా గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన నిషేధాన్ని నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఎత్తివేయటం హర్షణీయమని బీజేపీ పట్టణ అధ్యక్షుడు మామిడి రమేష్‌కుమార్ అన్నారు. ఈవిషయమై ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం హిందూ సంస్థల మీద, ఉద్యోగుల మీద ఆంక్షలు విధిస్తూ అన్యాయంగా వ్యవహరించారని ఇక ముందు అదిచెల్లదన్నారు. హిందూ ఉద్యోగులంతా వారికి ఇష్టమైన సంస్థలలో కార్యకలాపాలు జరుపుకోవచ్చు అన్నారు. హర్షం తెలియజేసిన వారిలో ముప్పల శ్రీనివాసరావు, నరాలశెట్టి శ్రీనివాస్, బాల నారాయణ, నటరాజన్, గుండ్రెడ్డి శ్రీహరి తదితరులు ఉన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

కొల్లూరు, జూలై 23 : సమాచార హక్కు చట్టంపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ కార్యాలయంలో మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో రేపల్లె ఏడీఏ అక్తర్ హుస్సేన్ పాల్గొని భారతీయ పౌరులందరికి సమాచార హక్కు చట్టం ద్వారా అన్ని ప్రభుత్వ శాఖల వారి నుంచి సమాచారం తీసుకోవచ్చన్నారు. రిసోర్స్ పర్సన్లు లివింగ్‌స్టన్, సునీల్ మాట్లాడుతూ ఆర్‌టీఐ ద్వారా తనకు కావాల్సిన సమాచారాన్ని ప్రతి పౌరుడు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవో ఆర్.వెంకటేశ్వరరావు, ఎంఈవో జ్యోతి, ఈవోపీఆర్డీ రవిబాబు, డిప్యూటీ తహసీల్దార్, ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మురుగు నీటిలోకి గంబూసియా చేపలు విడుదల

చుండూరు, జూలై 23 : దోమల పెరుగుదలను నివారించడంలో గంబూసియా చేపలు కొంత మేరా తోడ్పడతాయని మలేరియా నివారణ సబ్ అధికారి పిడికిలి నరేంద్రబాబు తెలిపారు. చుండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చుండూరు, అంబేద్కర్‌నగర్, మోదుకూరులో మురుగునీటి కాల్వల్లోకి, కుంటల్లోకి గంబూసియా చేపలను మంగళవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ చేపలు దోమల గుడ్లు, లార్వా, ప్యూపా దశల్లో ఉన్న దోమల పిల్లలను తిని దోమల పెరుగుదలను, అభివృద్ధిని అరికడతాయన్నారు. గ్రామాల్లో మురుగునీటి నిల్వలు ఉండకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ సిబ్బంది జాగుంట రాంబాబు, డి.సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి ఇంటూరి శివరామకృష్ణ, వైద్య ఆరోగ్య సిబ్బంది అమర్‌నాధ్, రాజకుమారి, ఈశ్వరి, రత్నకుమారి, శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.

నిండుగర్భిణీకి రక్తదానం చేసిన న్యాయవాది



రక్తదానం చేస్తున్న న్యాయవాది ఆళ్ళ సూరిబాబు

రేపల్లె, జూలై 23 : నిండుగర్భిణీ అత్యవసరంగా రక్తం అవసరం కావటంతో గతంలో రక్తాన్ని అందించిన న్యాయవాది సూరిబాబును సంప్రదించగా నేనిస్తానంటూ ముందుకు వచ్చి రక్తాన్ని అందించి నిండుగర్భిణీకి ప్రాణం పోశాడు. అరవపల్లి గ్రామానికి చెందిన ఓ నిండుగర్భిణీకి రక్తం తక్కువ కావటంతో కాన్పుకు ఇబ్బందులు పడటంతో మంగళవారం న్యాయవాది సూరిబాబును సంప్రదించగా రక్తాన్ని అందించారు. దీంతో గర్భిణీకి ప్రాణాపాయం తప్పింది. గతంలో ఇదే విధంగా రక్తం అవసరమైతే బ్లడ్‌బ్యాంక్‌వారు సంప్రదించగా ఎనిమిదిసార్లు వివిధ ప్రమాదాలకు గురైన వారికి ఆయన రక్తాన్ని అందించి వారి ప్రాణాలకు బాసటగా నిలిచారు. దీంతో రేపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన వెంకట గోపాలరావు, తోటి న్యాయవాదులు సూరిబాబును అభినందించారు.

ప్రభుత్వం ద్వారా వరి విత్తనాలు సరఫరా

అమృతలూరు, జూలై 23 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న వరివెద పొలాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వై.రామకృష్ణ మంగళవారం పరిశీలించారు. మండల పరిధిలోని మోపర్రు, పెదపూడి, యడవూరు గ్రామాల్లోని పొలాల రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి మొలక దశలో దెబ్బతిందని, రైతులు అధైర్య పడకుండా మరలా సాగు చేసేందుకు ప్రభుత్వం ద్వారా వ్యవసాయశాఖ సహాయం అందజేస్తుందన్నారు. ఆయన వెంట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.ఉష, కామాక్షి, ఉప్పునీటి పరిశోధన స్థానం బాపట్ల శాస్త్రవేత్త మృదుల, ఏడీఏ రత్నకుమారి, ఏవో లోకేశ్వరి, ఏఈవో శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరణ

అమృతలూరు, జూలై 23 : మండల పరిధిలోని కూచిపూడి గ్రంథాలయానికి దాత పుస్తకాలను బహుకరించారు. స్థానిక గ్రంథాలయంలో మంగళవారం జరిగిన కార్యక్ర మంలో వేజళ్ల వెంకటసుబ్బారావు విద్యా ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10 వేల విలువ గల పుస్తకాలను వేజళ్ల నవ్య అంద జేశారు. జాతీయ అవార్డు గ్రహీత ఉమామహేశ్వర్, పుస్తక పఠన ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా దాతకు గ్రంథాలయ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్ర మంలో మొవ్వా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రిక్షా కార్మికులకు రెయిన్‌కోట్‌లు పంపిణీ

రేపల్లె, జూలై 23 : రిక్షా కార్మికులకు తనవంతు సహాయ సహకారాలు అందించాలనే ఉద్దేశ్యంతో వర్షాకాలం కావటంతో రెయిన్‌కోట్స్ అందించటం జరిగిందని ఎన్ఆర్ఐ పరుచూరి శ్రీనాథ్ అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో రేపల్లె రైల్వేస్టేషన్ రిక్షా స్టాండ్ పరిధిలోని 25 మంది కార్మికులకు రెయిన్‌కోట్స్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జే.ధర్మరాజు,వెంకటేశ్వరరావు, పద్మావతి, రాంబాబు, రంగారావు పాల్గొన్నారు.

క్షేత్రాలను సందర్శించిన జిల్లా వ్యవసాయ అధికారి



రైతులకు సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి రామకృష్ణ

వేమూరు, జూలై 23 : ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు నీట మునిగిన వెదనాటు భూములను మంగళవారం బాపట్ల జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై.రామకృష్ణ సందర్శించారు. చావలి, అబ్బనగూడవల్లి గ్రామాల్లో పర్యటించిన ఆయన ప్రస్తుత పరిస్థితిని గుర్తించి రైతులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. విత్తనం మురిగిపోకుండా నీటిని వెంటనే బయటకు పంపాలని తద్వారా విత్తిన మొలక శాతం నష్టం రాకుండా ఉంటుందని సూచించారు. పర్యటనలో మండల వ్యవసాయ శాఖ అధికారి సునీత, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చుండూరు, జూలై 23 : చుండూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని వేటపాలెం 11 కెవి ఫీడర్ పరిధిలో ఉన్న గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అర్జునరావు మంగళవారం తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టనున్న కారణంగా నడిగడ్డపాలెం, వేటపాలెం, కెఎస్‌పల్లి, తోటపాలెం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.



మంత్రి సత్యప్రసాద్‌ను సన్మానిస్తున్న కాపుసంఘం అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు తదితరులు

మంత్రి అనగాని, ఎమ్మెల్యే నరేంద్రవర్మను సన్మానించిన కాపునాయకులు

కర్లపాలెం, జూలై 23 : బాపట్ల నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు, యాజలి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దామర్ల సూర్యనారాయణలు సచివాలయంలో మంగళవారం ఎమ్మెల్యే నరేంద్రవర్మను, మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాతా జయప్రకాష్ నారాయణ, దామర్ల సురేష్, రాఘవయ్య తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్యులతో సమీక్షిస్తున్న జిల్లా వైద్యాధికారిణి విజయమ్మ

భట్టిప్రోలు, జూలై 23 : వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని సీజనల్‌గా వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారిణి ఎస్.విజయమ్మ అన్నారు. మండలంలోని సూరేపల్లి పంచాయతీ తాతావారిపాలెంలో మంగళవా రం ఆమె పర్యటించి గ్రామంలో ఉన్న ప్రజలకు నీటి నిల్వలు లేకుండా చూడాలని అవగాహన కల్పించారు. వైద్య శిబిరం ఏర్పాటును పర్యవేక్షించి జ్వరాల పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీ వైద్యశాలలో వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా డెంగీ జ్వరాలు గత సంవత్సరం కంటే తగ్గుముఖం పట్టాయన్నారు. తాతావారిపాలెంలో జ్వరాలు అదుపులోకి వచ్చాయని, ప్రజలు వైరల్ ఫీవర్ బారినపడ్డారని సిబ్బంది గ్రామంలో శిబిరాలు ఏర్పాటు చేసి ఇంటింటికి తిరిగి వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. వరదలు వచ్చి వెళ్ళినప్పుడు ప్రజలు రోగాల బారినపడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని విజయమ్మ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పద్మజ, సీహెచ్ రామలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుండే దేశభక్తిని కలిగి ఉండాలి

భట్టిప్రోలు, జూలై 23 : విద్యార్థులు విద్యార్థి దశ నుండే దేశభక్తిని కలిగి ఉండాలని ఎంఈవో-2 ఎస్.దేవరాజ్ తెలిపారు. స్థానిక టీఎంరావ్ హైస్కూలులో మంగళవారం చంద్రశేఖర్ ఆజాద్, బాలగంగాధర్ తిలక్‌ల జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆజాద్, తిలక్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన త్యాగమూర్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని దేవరాజ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సి.రామకోటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పి.మనోజ్, సీఆర్పీ కృష్ణారావు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

లంక గ్రామాల రైతులు వరదపై అప్రమత్తంగా ఉండాలి

కొల్లూరు, జూలై 23 : లంక గ్రామాల రైతులు వరదపై అప్రమత్తంగా ఉండాలని బాపట్ల డీఏవో శ్రీరామకృష్ణ తెలిపారు. మండల పరిధిలోని చింతల్లంకతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి రైతులతో మాట్లాడారు. వాణిజ్య పంటలు విత్తుకుని కొద్ది రోజులు సమయం మాత్రమే అవుతుందని, ఈ తరుణంలో కృష్ణానదికి వరద పోటెత్తితే ఆయా పంటలు ఎందుకూ పనికి రాకుండా పోతాయని, తామంతా పెట్టుబడులు నష్టపోతామని రైతులు ఆయనకు వివరించారు. వరద తగ్గిన అనంతరం వాణిజ్య పంటలు కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏడీఏ అక్తర్ హుస్సేన్, మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు, ఎంపీఈవో శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ డీఏవో శ్రీరామకృష్ణ, ఏడీఏ అక్తర్ హుస్సేన్

రసాభాసగా ఉపాధి హామీ గ్రామసభ

● అవినీతి జరిగిందంటూ టీడీపీ శ్రేణుల ఆందోళన

భట్టిప్రోలు, జూలై 23 : 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జరిగిన ఉపాధి హామీ పనులపై మండలంలోని పల్లెకోనలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. సోషల్ ఆడిట్ గ్రామసభలలో భాగంగా పల్లెకోనలో జరిగిన గ్రామసభ ప్రారంభం నుంచి టీడీపీ శ్రేణులు ఉపాధిహామీ పనుల్లో అవినీతి జరిగిందని, వివరాలు తెలపాలంటూ అధికారులను కోరడంతో గందరగోళం నెలకొంది. ఆర్థిక సంవత్సరంలో రూ.45 లక్షల పనులు జరిగాయని అధికారులు తెలియజేయగా ఎక్కడెక్కడ పనులు జరిగాయో తెలియజేయాలని, కూలీలకు ఎన్ని పనిదినాలు కల్పించారు, ఎంత నగదు చెల్లింపులు జరిగాయి వివరాలు తెలపాలని అధికారులను నిలదీశారు. పనులు జరగకుండా వైసీపీ నాయకులు ఉపాధిహామీ నగదును దోచుకున్నారని టీడీపీ శ్రేణులు గ్రామసభలో ఆరోపించాయి. గ్రామాల స్థాయిలో గ్రామసభలు ముగిశాయని బుధవారం స్థానిక మండల కార్యాలయం వద్ద మండలస్థాయిలో సోషల్ ఆడిట్ గ్రామసభ జరుగుతుందని గ్రామసభలలో లేవనెత్తిన అంశాలు చర్చకు వస్తాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శివపార్వతి, సోషల్ ఆడిట్ డీఆర్‌పీ అజయ్, పంచాయతీ కార్యదర్శి కోటా శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతాంగం ఆయిల్‌ఫామ్ సాగుపై దృష్టి సారించాలి

● జిల్లా ఉద్యానశాఖ అధికారిణి జెన్నమ్మ



రైతులకు పామాయిల్ మొక్కలను అందజేస్తున్న జెన్నమ్మ

భట్టిప్రోలు, జూలై 23 : కేంద్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకు ఉద్యానవనశాఖ ద్వారా రాయితీలు అందిస్తున్నందున రైతాంగం పామాయిల్ సాగుపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారిణి పి.జెన్నమ్మ తెలిపారు. మండలంలోని ఓలేరు గ్రామంలో ఉద్యానవనశాఖ, అజంతాసోయా లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఆయిల్‌ఫామ్ సాగుపై రైతాంగానికి అవగాహన సమావేశం నిర్వహించి మొక్కలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 100 హెక్టార్లలో ఆయిల్‌ఫామ్ సాగు లక్ష్యంగా ఎంచుకున్నామన్నారు. జిల్లాలో భట్టిప్రోలు, కొల్లూరు, చుండూరు మండలాల భూమి అనుకూలంగా ఉన్నందున ఆయా మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నూరు శాతం రాయితీపై ప్రభుత్వం మొక్కలు అందజేయడం జరుగుతుందని, మొదటి 3 సంవత్సరాల వరకు వరి తప్ప అన్ని రకాల స్వల్పకాలిక పంటలను అంతరపంటలుగా సాగు చేసుకోవచ్చునని చెప్పారు. 4 సంవత్సరాల తరువాత 10 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుందని రూ.లక్ష నుంచి రూ.150 లక్షల లాభం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పరుచూరి రమేష్, నాదెళ్ళ ప్రభాకరరావు, వీహెచ్ జ్యోతి, జి.కల్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

వేటపాలెం(చీరాల), జూలై 23 : సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో శర్మ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండల పరిధిలోని పంచాయతీ సెక్రటరీలతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై సమీక్షా సవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో, ప్రధానంగా శివారు ప్రాంతాల్లో, జనావాసాలు ఉన్నచోట మురుగు నిల్వ లేకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని చెప్పారు. దోమకాటు ప్రబలకుండా చేపట్టాలని, మంచినీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని తదితర అంశాలపై చర్చించి, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోఆర్డీ ఎం.శ్రీనివాసరావు, అన్న గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

శింగరకొండలో రాతి ముఖమండపానికి విరాళం

అద్దంకి, జూలై 23 : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో నిర్మాణంలో ఉన్న రాతి ముఖమండపానికి బల్లికురవ మండలం చెన్నుపల్లికి చెందిన కుమ్మరి వెంకట్రావు, పద్మ దంపతులు మంగళవారం రూ.1.50 లక్షలను అందజేసినట్లు ఈవో సుభద్ర తెలిపారు.

నేడు గుర్రం జాషువా వర్ధంతి

అద్దంకిటౌన్, జూలై 23 : అద్దంకిలోని కొత్తపసుమర్తిపాలెంలో ఉన్న గుర్రం జాషువా విగ్రహం వద్ద జాషువా వర్ధంతి కార్యక్రమం బుధవారం 5 గంటలకు జరుగుతుందని బాధ్యులు పీసీహెచ్ కోటయ్య మంగళవారం ప్రకటన ద్వారా తెలిపారు. సాహిత్యాబిమానులు, కళాభిమానులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోటయ్య కోరారు.

పచ్చదనం మాటున.. ప్రమాదం..!

- డివైడర్ల మధ్య కోనో కార్పస్
- విరివిగా దుబాయ్ మొక్కల పెంపకం
- వీటితో ప్రమాదమని హెచ్చరిక


డివైడర్ల మధ్య పెంచుతున్న కోనో కార్పస్ మొక్కలు

చీరాల, జూన్ 23 : పచ్చదనానికి పెద్దపీట వేద్దాం. ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటండి. వాటిని సంరక్షించండి. పర్యావరణాన్ని పరిరక్షించండి. ఇవి పాలకులు, అధికారులు నిరంతరం చెప్పే మాటలు. అందులో భాగంగా ప్రధానంగా పట్టణ ప్రాంతాలలో డివైడర్ల మధ్య, ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారులకు ఇరువైపులా అందంగా కనిపించేందుకు కోనో కార్పస్ (దుబాయ్ మొక్కలు) మొక్కలు వేశారు. వేస్తున్నారు. అయితే వీటితో ప్రమాదమని ఇటీవల అధ్యయనాల్లో వెల్లడైంది. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో ఈ మొక్కలను నర్సరీలలో పెంచొద్దని, ఎక్కడా వాటిని వేయవద్దని ఆదేశించింది. కోనో కార్పస్ మొక్కలు పెంపకంతో ఏర్పడే అనర్థాలను వివరిస్తూ గతంలో బీబీసీలో కథనం వెలువడింది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత. అందులో ఎలాంటి సందేహం లేదు. పచ్చదనం పేరుతో ప్రమాదాన్ని కొనితెచ్చుకోవడం సరికాదు. దుబాయ్, పాకిస్తాన్, ఆఫ్రికా దేశాల్లో విరివిగా పెంచే కోనోకార్పస్ మొక్కలను పలు దేశాలు నిషేధించాయి. ఆ మొక్కలు క్రమేణా పెరిగి, భూమిలోకి అత్యధిక దూరం వేళ్ల పాకుతూ నీటి వనరులను హరించివేస్తాయి. దీంతో పాటు వర్షాభావ పరిస్థితులకు కారణమవుతాయి. ఇదిలావుంటే పట్టణప్రాంతాల్లో డివైడర్లు (మున్సిపల్ పరిధిలో) మధ్య వేసిన కోనోకార్పస్ మొక్కలు దీర్ఘకాలంలో భూగర్భంలో ఉన్న అండర్‌గ్రౌండ్ వాటర్ పైపులను కూడా దెబ్బతీసే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో వెలువడిన కథనాల నేపథ్యంలో ఇటు ఆంధ్రప్రదేశ్, అటు తెలంగాణ రాష్ట్రాల్లో చర్చ మొదలయింది. ఆ మొక్కలను తెలంగాణ రాష్ట్రంలో పెంచవద్దని, అవి భూగర్భ జాలను హరించడంతో పాటు, శ్వాసకోశ వ్యాదులకు కారకాలుగా మారతాయనే ఉత్తర్వులను కూడా ఇచ్చారు.

ప్రమాదం ఎలా అంటే

మొక్కలు, చెట్లలో సింహ భాగంగా కార్బన్ డయాక్సైడ్‌ను తీసుకుని, ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. ఇది ప్రాణవాయువు. ఎంతో ఉపయోగం. కోనో కార్పస్ మొక్కలు ఆక్సిజన్‌ను తీసుకుని, కార్బన్‌డయాక్సైడ్‌ను విడుదల చేస్తాయి. ఇది ప్రమాదం. కోనో కార్పస్ మొక్కలు పుష్పించే సమయంలో పుప్పొడి రేణువులు గాలిద్వారా ప్రయాణం చేస్తూ ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజలు శ్వాసతీసుకునే సమయంలో నేరుగా శరీరంలోకి వెళ్లిపోతాయి. దీంతో శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. దీనిపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

వైజాగ్‌లో 2వేల మొక్కలు తొలగించాం

ఇక్కడా తీసేస్తాం

కోనో కార్పస్ మొక్కలు ప్రమాదకరం. అందులో సందేహం లేదు. ఈ నేప థ్యంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వైజాగ్‌లో పనిచేసేపుడు అక్కడ 2వేల మొక్కలు తొలగించాం. ఇక్కడ ఎన్ని మొక్కలు ఉన్నాయో పరిశీలించి వాటిని తొలగించేందుకు ఉన్నతాధికారుల అనుమతితో అడుగులు వేస్తాం. ఆ మొక్కలు తొలగించిన వెంటనే ప్రత్యామ్నాయంగా ఆహ్లాదాన్ని, నీడను ఇచ్చే మొక్కలను కూడా వేసేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేస్తాం. వీలైనంత వరకు వచ్చే వారంలోనే ఆ చర్యలు చేపడతాం.

- చక్రవర్తి, కమిషనర్, చీరాల మున్సిపాలిటీ


సభ్యత్వ నమోదులో పాల్గొన్న విజయ్‌కుమార్

జనసేన పార్టీలో సభ్యత్వంతో భరోసా

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్

పర్చూరు, జూలై 23 : జనసేన పార్టీలో సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ భరోసా ఉంటుందని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపూడి విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం పర్చూరులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో విజయ్ కుమార్‌తోపాటు, ప్రవాసాంధ్రుడు జనసేన పార్టీ యువ నాయకులు మన్నెం శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాద బీమాతోపాటు, పార్టీ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రవాసాంధ్రులు మన్నెం శ్రీకాంత్, పార్టీ మండలపార్టీ అధ్యక్షుడు విన్నకోట అజయ్ కుమార్, కారంపూడి సందీప్‌తేజ, కఠారి సురేంద్ర బాబు తులసి సునీల్, మణి, లగడపాటి వెంకటమోహనసుచంద్, అప్పారావు, రంగిశెట్టి ఆంజనేయులు, గోగుల శ్రీను, అచ్చుకోలు సతీష్, బోగాది మోహన్, మారుతి, శ్రీను, నాగరాజు, శివయ్య, మల్లికార్జున, రాముడు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సత్కారం


తహసీల్దార్ సుభద్రను సత్కరిస్తున్న కార్యాలయ సిబ్బంది

బల్లికురవ, జూలై 23 : ఎన్నికల విధులలో భాగంగా నెల్లూరు జిల్లా నుంచి బల్లికురవకు వచ్చిన తహసీల్దార్ సుభద్ర తిరిగి తన సొంత జిల్లాకు బదిలీపై వెళుతున్నారు. దీంతో మంగళవారం కార్యాలయ ఉద్యోగులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ గత నాలుగు మాసాల వ్యవధిలో వృత్తిలో నిబద్ధతో పనిచేసి అందరితో మంచి అధికారిగా గుర్తింపు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, ఏఎస్‌వో అమరనాథ్, గ్రామ రెవెన్యూ అధికారులు, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బదిలీ అయినా కదలని కానిస్టేబుళ్లు

బల్లికురవ, జూలై 23 : టీడీపీ అధికారంలోకి రాగానే బల్లికురవ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ముగ్గురు పోలీసు సిబ్బందిని మూడు సర్కిళ్లకు ఎస్పీ ఆదేశాలతో బదిలీ చేశారు. వీరి బదిలీ ఉత్తర్వులు వచ్చి పది రోజులు దాటినా వారు మాత్రం ఇంకా స్టేషన్ నుంచి రిలీవ్ కావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బదిలీ అయిన వారిలో ఇద్దరు వెళ్లేందుకు సిద్ధం అవుతుండగా, ఒక కానిస్టేబుల్ ఇక్కడే ఉండేందుకు టీడీపీ నేతల చుట్టూ తిరుగుతున్నారు. బల్లికురవ స్టేషన్‌లో మామాళ్లు బాగా ముడుతుండడంవల్లే ఇక్కడినుంచి కదలడం లేదన్న విమర్శలున్నాయి. బదిలీ ఉత్తర్వులు అందుకున్న కానిస్టేబుల్ గ్రానైట్ క్వారీల వద్ద హల్‌చల్ చేస్తూ వసూలు చేస్తున్నట్లు కొందరు ఆరోపిస్తున్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

అద్దంకిటౌన్, జూలై 23 : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు దాతల సహకారంతో నోటు పుస్తకాలను అందజేశారు. అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాతలు కొల్లిపర నాగయ్య, మలాది శ్రీనివాసరావుల సౌజన్యంతో ఏడు వేల రూపాయలతో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, హ్యాండ్ వాష్ బాటిల్స్‌తో స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీకృష్ణ, చిన్ని మరళికృష్ణ, శ్రీనివాసరావు, శ్రీరామచంద్రమూర్తి, హెచ్‌ఎం విజయభాస్కర్, విద్యా కమిటీ ఛైర్మన్ చందు పాల్గొన్నారు.

మురుగు నివారణ చర్యలు

పంగులూరు, జూలై 23 : పంగులూరులో డ్రైనేజీలలో పేరుకున్న మురుగును తొలగించే చర్యలకు గ్రామ పంచాయతీ శ్రీకారం చుట్టింది. గ్రామంలోని దళితవాడలలో డ్రైనేజీలలో చెత్తాచెదారం పేరుకుని మురుగు నీరు ముందుకు సాగక దోమలు, ఈగల ఉధృతి పెరగడంతో వ్యాధులు పెరుగుతాయని భావించిన పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గ్రామంలోని కాలువలలో పేరుకున్న మురుగును తొలగించి వర్షపు నీరు ముందుకు పోయేందుకు వీలుగా 24 మంది కూలీలలతో పనులు చేపట్టినట్లు కార్యదర్శి సునీత తెలిపారు. సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం, కార్యదర్శి సునీత పరిశీలించారు.

లోకమాన్య తిలక్‌కు నివాళి

మార్టూరు, జూలై 23 : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి స్థానిక ఎఫర్ట్ కార్యాలంలో స్వర్గీయ లోకమాన్య బాల గంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మద్దుమాల కోటేశ్వరరావు, మాదాల సాంబశివరావు, కాజారావు, బసవరాములు, కోటేశ్వరరావు, హనుమంతరావు, అంకమ్మచౌదరి పాల్గొన్నారు.

ఘనంగా రొట్టెల పండుగ

ఇంకొల్లు, జూలై 23 : మండలంలోని గంగవరంలో మూడు రోజులుగా నౌవు షహీద్ దర్గా 403వ గంధమహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా రొట్టెల పండుగను ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

బల్లికురవలో పారిశుధ్య పనులు

బల్లికురవ, జూలై 23 : బల్లికురవ మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ రోడ్డులో మంగళవారం పంచాయతీ సర్పంచ్ పందిరి అంజిబాబు ఆదేశాలతో పారిశుధ్య కార్యక్రమాలు ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ పర్యవేక్షణలో పోలీసు స్టేషన్‌కు వచ్చే మండల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాలను తీసి వేయించారు. అలానే గ్రామంలో కూడా పలు వీదులను శుభ్రం చేయిస్తామని వారు తెలిపారు.

బాల్యవివాహాలపై అవగాహన

చీరాల, జూలై 23 : కస్తూర్బా బాలికోన్నత పాఠశాలలో మంగళవారం బాలల పరిరక్షణ విభాగం పీడీ ఉమాదేవి ఆదేశాల మేరకు మంగళవారం విద్యార్థినులకు బాల్యవివాహాలు, బాలికా సంరక్షణ, హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఆఫీసర్ స్వప్నప్రియ, విభాగ కౌన్సిలర్ రోజిలీనాలు విద్యార్థినులను అవగాహన కల్పించారు. విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం కృష్ణమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఈపూరుపాలెంలో వృద్ధురాలి దారుణ హత్య

- కత్తితో గొంతులో పొడిచిన దుండగులు
- పోలీస్ స్టేషన్‌కు అతి తక్కువ దూరంలో ఘటన

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జూలై 23 : చీరాల మండలం ఈపూరుపాలెంలో విశ్రాంత ఉపాధ్యాయినిని దారుణంగా హతమార్చారు. వివరాల్లోకి వెళితే పోలీస్ స్టేషన్ వెనుక జెండా చెట్టు సమీపంలో పిల్లి లలిత(74) ఒంటరిగా నివాసం ఉంటున్నారు. మంగళవారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి కత్తితో ఆమె గొంతులో పొడిచి పరారయ్యారు. సమాచారం అందుకున్న ఎస్పీ తుషార్ డూడీ హుటాహుటీన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. అయితే గ్రామంలోనే నెల కిందట యువతి హత్య, ఇప్పుడు రెండో ఘటనతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు.


వివరాలు సేకరిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ



మాట్లాడుతున్న ఏవో సుమతి

పరిపాలన పారదర్శకంగా ఉండాలి

చీరాలటౌన్, జూలై 23 : పరిపాలన పారదర్శకంగా ఉండాలని తద్వారా జవాబుదారీతనం ప్రజలకు అందుతుందని ఎంపీడీవో శోభారాణి, వ్యవసాయాధికారి సుమతి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టం-2005 మండల స్థాయి అవగాహన కార్యక్రమం మంగళవారం స్థానిక మండల కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిచారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులు మాట్లాడుతూ అధికారికంగా పనిచేస్తున్న అన్ని ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన సమాచారాన్ని కార్యాలయం ముందు స్వచ్ఛందంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుందని వివరించారు. సమాచారాన్ని కోరిన అర్జీదారులకు ఎటువంటి సమాచారాన్ని ఏవిధంగా ఇవ్వాల్సి ఉంటుందనే అంశాన్ని వివరించారు. అంతేకాకుండా ప్రతినిధులకు దాసరి ఇమ్మానియేల్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. కార్యక్రమంలో డీటీ సురేష్, ఐఏఎల్ ఏవో సరిత, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఏఈ పురుషోత్తం, విద్యుత్ ఏఈ రామ్‌కుమార్, జేఈ శ్యాంసుందర్. బ్రహ్మం, ఈపూరుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.శ్రీదేవి, వెటర్నరీ వైద్యురాలు డా. పావని, తదితర ప్రభుత్వ, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నైపుణ్యాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

అద్దంకిటౌన్, జూలై 23 : ప్రతి రోజు ఉపాధ్యాయులు అభ్యసన, సంఖ్యాశాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయాలని, దానిలో అందరూ భాగస్వాములు కావాలని ఎంఈవో బీ సుధాకరరావు అన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మాయపాలెం ప్రాథమిక పాఠశాల శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఎంఈవో సుధాకరరావు సందర్శించారు. ఈనెల 29వ తేదీ వరకు అన్ని పాఠశాలల్లో శిక్ష సప్తాహ్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ఛైర్మన్ పి.గంగాధరరావు, హెచ్‌ఎం సర్వేశ్వరరావు, సీఆర్‌ఎంటీ ఎం.రమేష్‌బాబు పాల్గొన్నారు.

70శాతం రాయితీపై గోకులం షెడ్లు

చినగంజాం, జూలై 23 : గోకులం పథకం ద్వారా పశువుల షెడ్లకు 90 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు 70 శాతం రాయితీ ఇస్తున్నట్లు చినగంజాం పశువైద్యాధికారి డాక్టర్ బి.కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందారులకు ఉపాధిహామీ పథకం ద్వారా షెడ్ల నిర్మాణాలకు సంబంధించి గోకులం పథకానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ఈ పథకం ఉపాధి హామీ పథకం అధికారులు, ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో చేపట్టనున్నట్లు తెలిపారు. 2, 4 లేదా 6 పశువులు, 20 లేదా 50 గొర్రెలు, మేకలు, 100 నుండి 200 కోళ్లను ఒక యూనిట్‌గా మంజూరు చేస్తారని తెలిపారు. 70 శాతం ప్రభుత్వ రాయితీ అందజేస్తుందని, మిగిలినది రైతు వాటా లేదా ఉపాధిహామీ వేజ్ కాంపొనెంట్ కింద జమ చేస్తారని తెలిపారు. చినగంజాం మండలంనకు 50 షెడ్ల నిర్మాణానికి మంజూరు ఇచ్చినట్లు తెలిపారు. దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, జాబ్ కార్డు, స్థలానికి సంబంధించిన పత్రాలు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను రైతు సేవా కేంద్రం, పశు వైద్యశాలలో అందజేయాలని తెలిపారు. ఈ సదుపాయాన్ని మండల పరిధిలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కిరణ్‌కుమార్ కోరారు.

బ్యాంకు సేవలపై అవగాహన

అడుసుమల్లి(పర్చూరు), జూలై 23 : అడుసుమల్లి జిల్లా పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు బ్యాంకు సేవలపై మంగళవారం విశ్రాంత నవోదయ ఉపాధ్యాయుడు పిన్నక సాంబయ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలకు సైతం బ్యాంకు సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. అనంతరం బ్యాంకు సేవలు, తదితర అంశాలపై విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయితీ రుణాలను వినియోగించుకోవాలి

మేదరమెట్ల , జూలై 23 : డ్వాక్రా గ్రూపు మహిళలు రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని స్త్రీనిధి మేనేజర్ నాగశంకర్ తెలిపారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో వీవోఏలతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పీఎంఈజీపీ, పీఎం ఎఫ్ఎంజీ, ముద్ర రుణాలను బ్యాంక్ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. మండలానికి 242 అందించాలని లక్ష్యం అని ఆయన తెలిపారు. డ్వాక్రా మహిళలందరూ స్త్రీనిధి రుణాలను సకాలంలో చెల్లించేలా వీవోఏలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం అనూరాధ, సీసీలు మస్తాన్‌వలి, సాంబయ్య, చంద్రశేఖర్, మండల సమైఖ్య అధ్యక్షురాలు జ్యోతుల రాజ్యం పాల్గొన్నారు.

ఉంచుదామా.. తీసేద్దామా..!

- మునిసిపాలిటీలో కాంట్రాక్టు కార్మికుల విషయమై సమాలోచన
- 2019 తరువాత 40 మందిని తీసుకున్నట్లు నివేదిక సిద్ధం చేసిన అధికారులు
- తమను కొనసాగించాలని కొందరు పైరవీలు



చీరాల, జూలై 23 : చీరాల పురపాలక సంఘంలో కాంట్రాక్టు కార్మికుల కహాని రాజకీయవర్గాల్లో జోరుగా చర్చసాగుతోంది. ప్రధానంగా 2019 నుంచి 2024 వరకు ఉన్న కొందరు కాంట్రాక్టు కార్మికులను కొలువుల నుంచి తప్పించాలని అధికార పార్టీ భావిస్తున్నట్లు ప్రచారం ఉంది. కొందరు పైరవీకారులు బాహాటంగా చేస్తున్న వ్యాఖ్యలు అందుకు బలాన్నిస్తున్నాయి. 2019 ఎన్నికల తరువాత సుమారు 40 మంది కాంట్రాక్టు కార్మికులుగా తీసుకున్నట్లు అధికారులు నివేదిక తయారు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. వారందరినీ ఉంచుదామా, తీసేద్దామా.. అనే కోణంలో అధికార పార్టీ యోచిస్తున్నట్లు కొందరు బహిరంగంగానే అంటున్నారు. అయితే అందులో కొందరు పైరవీకారులు ఉండడం విశేషం. ఈ క్రమంలో ఇటీవల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మున్సిపల్ కార్యాలయంలో పలు విభాగాల అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ముందుగా రిక్వెస్ట్‌గా చెప్తా .. కాదం టే పనిష్‌మెంటేనని సున్నితంగా, స్పష్టంగా చెప్పారు. ఆ వెసులుబాటు ఆ రోజు సమీక్షా సమావేశంలో పాల్గొన్న వారికేనా, లేకుంటే కాంట్రాక్టు కార్మికులకు కూడా వర్తిస్తుందా అనే కోణంలో అధికారులు, సిబ్బంది, రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో నిర్ణ యం ఏదైనా పైరవీకారులను మాత్రం దరిచేయనీయవద్దని, లేదంటే అంతిమంగా వారికే నష్టం చేకూర్చే పరిస్థితులు ఎదురవుతాయనే కోణంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కూటమి శ్రేణుల్లో పలువురు సూచిస్తున్నారు.


రామకూరు లాకుల వద్ద జలాలను పరిశీలిస్తున్న ఈఈ

సాగర్ జలాలతో చెరువులు నింపండి

పంగులూరు, జూలై 23 : ప్రజల తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన సాగర్ జలాలతో మంచినీటి చెరువులను నింపాలని ఎన్నెస్పీ ఈఈ ఉమామహేశ్వరరావు కోరారు. కొణంకి సబ్ డివిజన్ పరిధిలోని రామకూరు 37వ మైలు వద్దకు చేరుతున్న సాగర్ జలాలను మంగళవారం ఈఈ పరిశీలించారు. ఏబీసీ పరిధిలో 37వ మైలు వద్దకు 378 క్యూసెక్కుల నీరు చేరుతుండగా, యద్దనపూడి, పమిడిపాడు, కోటపాడు, ద్రోణాదుల మేజర్లకు నీటిని మళ్లిస్తున్నట్లు తెలిపారు. పల్నాడు జిల్లా పరిధిలోని 18వ మైలువద్ద నుంచి కాలువలో ప్రవహిస్తున్న సాగర్ జలాలను పరిశీలించామని, సోమవారం కన్నా నీటి ప్రవాహం కొంత తగ్గిందన్నారు. వృథా చేయకుండా జాగ్రత్తగా చెరువులు నింపుకోవాలన్నారు. బుధవారానికి నీటి ప్రవాహం కొంత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. పమిడిపాడు మేజర్‌తో పాటు కోటపాడు, ద్రోణాదుల, నూతలపాడు మైనర్ల పరిధిలోని మంచి నీటి చెరువులన్నిటినీ నీటితో నింపాలని ఈఈ సూచించారు. ఆయనతోపాటు కొణంకి సబ్ డివిజన్ డీఈ స్వామి, జేఈలు సుబ్బారావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

నోటిఫైడ్ చెరువులకు నీరు

- ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య

తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన నీటితో మండలంలోని నోటిఫైడ్ చెరువులు నింపాల్సిన అవసరం ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని పంగులూరు, చందలూరు, ఏవీ పాలెం, కొప్పెరపాడు, జేవీపాలెం చెరువులను డీఈ వేణుగోపాల్, ఏఈ శివయ్య పరిశీలించారు. ఆరికట్లవారిపాలెం, కోటపాడు, జాగర్లమూడివారిపాలెం, నూజెళ్లపల్లి చెరువులకు సాగర్ నీటిని మళ్లించి చెరువులు నింపే చర్యలు చేపట్టామన్నారు. సోమవారం 37వ మైలు వద్ద నుండి పమిడిపాడు మేజర్‌కు 200ల క్యూసెక్కుల నీరు విడుదల కాగా మంగళవారం 138 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదలయినట్లు తెలిపారు. మండలంలోని నూజెళ్లపల్లి, ఆరికట్లవారిపాలెం, పంగులూరు, మల్లవరం, బూదవాడ, కేవీపాలెం, కొప్పెరపాడు జేవీపాలెం, జనకవరం, చందలూరు, కొప్పెరపాడు, తక్కెళ్లపాడు చెరువులకు నింపాల్సిన అవసరం ఉందన్నారు. పమిడిపాడు మేజర్‌కు 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తేనే చెరువులను కొంతమేర నింపగలుగుతామని తెలిపారు.


ఊరేగింపుగా అమ్మవారికి సారెను తీసుకెళ్తున్న భక్తులు

నాంచారమ్మకు ఆషాడ సారె

పర్చూరు, జూలై 23 : పర్చూరులోని గ్రామ దేవత శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారికి మంగళవారం ఆషాడ మాస సారెను బహూకరించారు. తొలి ఏకాదశ ముందు అమ్మవారికి సారె ఇవ్వడం ఆనవాయితీ. అమ్మవారికి సారె ఇవ్వడం ద్వారా గ్రామం సుభిక్షంగా ఉంటుందని, పాడి పంటలు వృద్ధి చెందుతాయని భక్తుల నమ్మకం. ఆలయ వంశం పారంపర్య అర్చకులు తులసి వారి సారథ్యంలో అమ్మవారికి సారెను బహూకరించారు. కార్యక్రమంలో పెద్దకాపు, తులసి వారు పాల్గొన్నారు.

జ్వరాలు తగ్గేవరకూ వైద్య శిబిరం

బల్లికురవ. జూలై 23 : జ్వరాలు, చికున్ గున్యా అదుపులోకి వచ్చే వరకు వైద్య శిబిరాన్ని గ్రామంలో కొనసాగించాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి ప్రేమ్‌చంద్ ఆదేశించారు. అంబడిపూడి గ్రామాన్ని వైద్యాధికారి పరిశీలించారు. జ్వరాలబారిన పడి కాళ్ల నొప్పులతో బాధపడుతున్న రోగులను అయన పరిశీలించారు. అలానే గృహాలలో నిల్వ ఉన్న కూలర్‌లో ఉన్న లార్వా దోమలను చూసి అయన వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటింటికీ తిరిగి గృహాల పరిసరాలను పరిశీలించి ప్రజలకు తగు సూచనలు చేయాలన్నారు. మురుగు నిల్వ లేకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జ్వరాలు తగ్గిన నొప్పులు కొన్ని రోజులు ఉంటాయని ప్రజలు వైద్య సిబ్బంది వద్ద మందులను తీసుకోవాలన్నారు. అనంతరం వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో వైద్యాధికారి రవితేజ, సిబ్బంది ఉన్నారు.


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి ప్రేమ్‌చంద్

స్తంభాలకు తీగలు

- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- పొంచి ఉన్న ప్రమాదాలు


శింగరకొండపాలెం సమీపంలో స్తంభానికి అల్లుకున్న తీగ


బొమ్మనంపాడు రోడ్డులో జగనన్న కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎగబాకిన మొక్కలు

అద్దంకి, జూలై 23 : మొక్క దశలో తుంచి వేయకపోతే పెను ప్రమాదానికే దారి తీసే అవకాశం ఉంది. పలు చోట్ల మొక్కల తీగలు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు ఎగబాకి విద్యుత్ లైన్‌లకు అల్లుకుంటున్నాయి. దీంతో ఆయా ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించే అవకాశం ఉంది. అదే సమయంలో విద్యుత్ తీగల నుంచి మొక్కలకు విద్యుత్ ప్రసరణ జరిగి అటు వైపు వెళ్లే పశువులు, ప్రజలు విద్యుత్ షాక్‌కు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వానలు పడుతుండడడంతో మొక్క తీగలు మరింత ఏపుగా ఎగబాకుతున్నాయి. ప్రారంభదశలో అయితే వాటిని సులువుగా తొలగించే అవకాశం ఉంటుందని, అలా కాకుండా ఆలస్యం చేస్తే సమస్య తీవ్రతరం అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా సిబ్బంది ఆయా ప్రాంతాలలో విద్యుత్ స్తంభాలకు అల్లుకుపోయిన మొక్కల తీగలను తొలగించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

చినగంజాం, జూలై 23 : గ్రామాల్లోని ప్రజలు సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.వేణుగోపాలకృష్ణమూర్తి అన్నారు. మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని కోడూరివారిపాలెం, కాటంవారిపాలెం, నీలాయపాలెం, చింతగుంపల్లి గ్రామాలను మంగళవారం ఆయన సందర్శించి, పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి, పలు సూచనలు ఇచ్చారు. కోడూరివారిపాలెంలో వైరల్ జ్వరాలతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వారిని పరామర్శించారు. చింతగుంపల్లి కాలువను శుభ్రం చేయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు.